

బియ్యం దందా..!





కదిరి కేంద్రంగా తంతు

- నియోజకవర్గంలో ఉచిత బియ్యం కొనుగోళ్లు
- ఆటోల్లో కదిరికి చేరుస్తున్న వైనం
- పాలిష్ పట్టి, సంచులు మార్చి.. యథేచ్ఛగా కర్ణాటకకు రవాణా
- అధికారులకు మామూళ్లు
- దగ్గరుండి సరిహద్దు దాటిస్తున్న వైనం
- కూటమి పాలనలో అడ్డుకట్ట పడేనా?



కదిరి, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా పేద ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యం కర్ణాటకకు తరలిపోతోంది. కదిరి కేంద్రంగా బియ్యం దందా సాగుతోంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో లబ్ధిదారుల నుంచి వ్యాపారులు బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. వాటిని ఆటోల్లో కదిరిలోని బియ్యం మిల్లులకు చేరుస్తున్నారు. వాటికి పాలిష్ చేసి, సన్నబియ్యంలా మార్చి 25 కిలోల సంచుల్లో నింపి, కర్ణాటకకు తరలిస్తున్నారు. అక్కడ అధిక ధరలకు విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారంలో మామూళ్లు పుచ్చుకుంటున్న అధికారులు.. దగ్గరుండి బియ్యం లోడ్లను సరిహద్దు దాటిస్తున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. గత వైసీపీ పాలనలో ఐదేళ్లు ఈ దందా యథేచ్ఛగా సాగింది. కూటమి పాలనలోనైనా అడ్డుకట్ట పడేనా అన్న చర్చ వినిపిస్తోంది.

తరలిపోతున్న బియ్యం

ప్రభుత్వం మనిషికి ఐదు కేజీల చొప్పున ప్రతినెలా బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తోంది. నాణ్యత లేకనో, తినడానికి ఇబ్బందిగా ఉందనో పలువురు లబ్ధిదారులు అమ్ముకుంటున్నారు. ఉచితంగా వచ్చే బియ్యాన్ని కేజీ రూ.20 చొప్పున నియోజకవర్గంలో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. వీటిని ఆటోల ద్వారా కదిరికి చేరుస్తున్నారు. వాటిని పోలీసులు పట్టుకోకుండా నెలనెలా మామూళ్లు ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కదిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి దాదాపు 30 ఆటోల ద్వారా బియ్యం కదిరిలోని వివిధ ప్రాంతాలకు చేరుతున్నట్లు సమాచారం. కొంతమంది వ్యాపారులు వాటిని కర్ణాటకకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. బియ్యానికి పాలిష్ పట్టి, మరికొన్నింటిని సంచులు మార్చి, కర్ణాటకకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. కదిరి నుంచి ఈ బియ్యం మూడు మండలాలు దాటి కర్ణాటకలోకి ప్రవేశించాలి. నల్లచెరువు, తనకల్లు, అమడగూరు మీదుగా వెళ్లడానికి అనేక మార్గాలున్నాయి. వాటిని దాటించడానికి కొంతమంది పోలీసులు సహకారం అందిస్తున్నట్లు సమాచారం. నెలనెలా వారికి వ్యాపారులు రూ.లక్షలో మామూళ్లు ముట్టచెబుతున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా కదిరికి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి సబ్సిడీ బియ్యం చేరుతోంది. అమడగూరు వ్యాపారులు మాత్రం నేరుగా పక్కనే ఉన్న కర్ణాటకకు తరలిస్తున్నట్లు తెలిసింది.

అడ్డుకట్ట పడేనా?

విచ్చలవిడిగా సాగుతున్న బియ్యం అక్రమ రవాణాకు కూటమి ప్రభుత్వంలో అయినా అడ్డుకట్టపడేనా అని ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. కదిరి ప్రాంత బియ్యం బెంగళూరుతోపాటు ఆ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల హోటల్ అవసరాలు తీరుస్తున్నట్లు తెలుస్తోంది. గత వైసీపీ పాలనలో బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగింది. అప్పట్లో ఆ పార్టీ నాయకులు, అధికారులు రూ.కోట్లు వెనకేసుకున్నారు. కూటమి పాలనలోనైనా ఈ అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సబ్సిడీ బియ్యం అక్రమ రవాణాపై ప్రభుత్వం సీరియస్‌గా ఉండడంతో కదిరి ప్రాంతంలో అధికారులు ఏమేరకు చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

మామూళ్లు ముట్టజెబుతూ..

పేదలకిచ్చే ఉచిత బియ్యం కర్ణాటకకు చేరే టప్పటికి సన్నరకాలుగా మారిపోతోంది. అక్కడ కేజీ రూ.80 వంతున విక్రయిస్తున్నట్లు సమాచారం. పల్లెల్లో కొనుగోలు చేసిన వ్యాపారులు కదిరిలోని నాలుగైదు డిపోలకు చేరుస్తున్నారు. అక్కడ పాలిష్ చేయించి, సన్నబియ్యంగా మార్చి 25 కిలోల ప్యాకెట్లలోకి నింపుతున్నారు. వాటిని లారీల్లో కర్ణాటకకు తరలిస్తున్నారు. అందుకు అధికారులే సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. లారీ బయలు దేరింది మొదలు.. అధికారులే దగ్గరుండి సిబ్బందితో సరిహద్దు దాటిస్తున్నట్లు సమాచారం. వారిలో పైనుంచి కిందిస్థాయి వరకు వ్యాపారుల నుంచి మామూళ్లు అందుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కారణంతోనే బియ్యం కర్ణాటకకు నిరాటంకంగా తరలిపోతోందని తెలుస్తోంది. ఏస్థాయిలో కూడా వాటిని పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అక్రమ రవాణాను అరికడతాం

సబ్‌డివిజన్ పరిధిలో బియ్యం అక్రమ రవాణాపై నిఘా ఉంచుతాం. రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమ రవాణాకు పోలీసులు సహకరించినట్లు తేలితే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవు.

-శివనారాయణస్వామి, డీఎస్పీ, కదిరి



ఆలయ నిర్మాణానికి చెక్కును అందజేస్తున్న మస్తాన్‌వలీ

రాములోరి సేవలో ముస్లిం

ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల చెక్కు

తనకల్లు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): రాములవారి ఆలయ నిర్మాణానికి ముస్లిం సేవలు అందిస్తున్నారు. మండలంలోని కొర్తికోట గ్రామంలో శ్రీరామాలయ నిర్మాణానికి రూ.రెండు లక్షల చెక్కును మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు ఎస్‌కె మస్తాన్‌వలీ బుధవారం గ్రామస్థులకు అందించారు. ఆలయ నిర్మాణం పూర్తయ్యాక విగ్రహాల ప్రతిష్ఠకు అయ్యే ఖర్చు సైతం భరిస్తానని గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

పోలీసు క్రీడాపోటీలు ప్రారంభం



పోలీసు క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు క్రీడాపోటీలకు బుధవారం స్థానిక శిరసాని పోలీసు పరేడ్ మైదానంలో శ్రీకారం చుట్టారు. ఏఎస్పీ శ్రీనివాసులు పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తీవ్ర ఒత్తిడితో విధులు నిర్వహించే పోలీసుల్లో క్రీడాపోటీలు ఉత్తేజం నింపుతాయన్నారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని ఆయన సూచించారు. అనంతరం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో హిందూపురం ఏఆర్, ధర్మవరం సబ్‌డివిజన్ జట్లు విజయం సాధించాయి. సెమీఫైనల్లో ఈ జట్లు తలపడనున్నాయి. కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాసులు, హిందూపురం డీఎస్పీ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అవగాహన

పుట్టపర్తి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్‌పై అవగాహన సదస్సును గురువారం ఉదయం 10గంటలకు స్థానిక సాయిఆరామంలో నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అర్బన్ ఏఈ నారాయణమ్మ ప్రకటనలో తెలిపారు. సోలార్ విద్యుదుత్పత్తి, ప్రయోజనాల గురించి అవగాహన కల్పిస్తామనీ, ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్దుబాటు సంకటం..!



టీచర్లకు నెలవారీ పని సర్దుబాటు యోచన?
విద్యార్థుల ఎన్‌రోల్‌మెంటే ప్రామాణికం
హెచ్చుతగ్గుల ఆధారంగా సర్‌ప్లస్, డెప్యుటేషన్లు

ధర్మవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు పని సర్దుబాటు సంకటం వచ్చి పడింది. టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను ఇక మీదట నెలవారీగా చేపట్టేలా కొత్త విధానానికి విద్యాశాఖ తెరతీసింది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే ఉపాధ్యాయులు ఏ స్కూల్‌లో పనిచేస్తున్నామో, తరువాతి నెలలో ఏ పాఠశాలలో పనిచేయాల్సి ఉంటుందోననే గందరగోళం ఏర్పడుతుంది. ఎన్‌రోల్‌మెంట్‌కు కటాఫ్ తేదీని ప్రామాణికంగా తీసుకుని, టీచర్, విద్యార్థుల నిష్పత్తి ఆధారంగా ఆయా స్కూళ్లు, సబ్జెక్టుల్లో మిగులు (సర్‌ప్లస్) టీచర్లను గుర్తించి, వారిని కొరత ఉన్న పాఠశాలలకు తాత్కాలికంగా డెప్యుటేషన్‌పై సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్) చేసే విధానం ఇప్పటివరకు అమల్లో ఉంది. తాజాగా జారీ అయిన మౌఖిక ఆదేశాల ప్రకారం ఇక నుంచి ఆయా పాఠశాలల్లో ప్రతి నెలా 30వతేదీ నాటి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను ప్రామాణికంగా తీసుకుని సర్‌ప్లస్ టీచర్లను గుర్తించి, వెంటనే వారిని కొరత ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేసే దిశగా కసరత్తు సాగుతోంది. నెలవారీ సర్దుబాట్లు.. నిబంధనలకు విరుద్ధం కావడంతో ఈ విషయమై లిఖితపూర్వకంగా ఎక్కడా ఉత్తర్వులు లేకుండా, ఎవరూ న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం లేకుండా ఉండేందుకు కేవలం మౌఖిక సమాచారంతోనే ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

మిగులు భయం

ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో విద్యార్థుల సమగ్ర డేటాను అపార్ పేరిట నమోదు చేస్తున్న విషయం తెలిసిందే. జిల్లాలో ఇప్పటివరకు 60 శాతంపైగా విద్యార్థుల అపార్ నమోదు పూర్తయిందని కొన్నిరోజుల క్రితమే డీఈఓ కిష్టప్ప ప్రకటించారు. మిగతా విద్యార్థుల వివరాల నమోదుకు పుట్టిన తేదీలు, ఆధార్, పేర్ల సవరణ తదితర సమస్యలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సమగ్ర వివరాలులేని విద్యార్థుల డేటాను అపార్‌లో నమోదు చేసే అవకాశం లేకపోవడంతో అటువంటి వారిని స్కూలు డ్రాప్‌బాక్సులో కొందరు హెచ్‌ఎంలు వేస్తున్నారు. దీంతో సంబంధిత విద్యార్థుల పేర్లు స్కూలు యు-డైస్ డేటాలో కనబడవు. వాస్తవానికి డ్రాప్‌బాక్సులో వేసిన విద్యార్థులు భౌతికంగా అదే స్కూల్‌లో ఉన్నప్పటికీ ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకునే యు-డైస్‌లో సంబంధిత విద్యార్థి పేరు లేకపోతే మరోచోటకు వెళ్లిపోయినట్టుగానే పరిగణిస్తారని చెబుతున్నారు. ఇలా చాలా పాఠశాలల్లో అపార్ ప్రతిష్టంభన కారణంగా విద్యార్థులను స్కూలు డ్రాప్‌బాక్సులో వేశారు. వారంతా భౌతికంగా అదే స్కూలులోనే ఉంటున్నారు. తాజాగా నెలవారీ వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు స్కూలు యుడైస్ డేటానే విద్యాశాఖ ప్రామాణికంగా తీసుకుంటుండటంతో కొత్తగా సర్‌ప్లస్ టీచర్ల ఆవిర్భావానికి కారణమవుతోందని భావిస్తున్నారు. నెలవారీ వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో సర్‌ప్లస్‌గా గుర్తించిన టీచర్లను కొరత ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేసిన తరువాత మరుసటి నెలలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరిగితే ఆ టీచర్‌ను మళ్లీ వెనక్కి పంపించే అవకాశం లేదని తెలిసింది. ఇతర పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయుల నుంచి కొరత ఉన్న స్కూలుకు డెప్యుటేషన్లపై సర్దుబాటు చేస్తారు. అపార్ నమోదుకు నెలాఖరు వరకు గడువు ఉంది. తరువాత మరికొంత కాలం పొడిగించే అవకాశం లేకపోలేదు. అపార్‌కు ఆటంకంగా ఉన్న సమస్యలను పరిష్కరించలేని పరిస్థితుల్లో పలువురు విద్యార్థులను స్కూలు డ్రాప్‌బాక్సులో వేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు యు-డైస్ ప్రామాణికంగా తీసుకుంటుండడం ఉపాధ్యాయులకు తీరని నష్టమేనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

అభ్యంతరాలకు అవకాశం..?

ఏడాదికోసారి మాత్రమే చేపట్టే మిగులు టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను నెలవారీగా అమలు చేస్తుండడంపై అభ్యంతరాలు వచ్చే అవకాశం ఉంది. ఈఏడాది ఆగస్టులో జిల్లాలో చేపట్టిన వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో 1186 మంది సర్‌ప్లస్ టీచర్లను గుర్తించి.. వీరిలో 686 మందిని కొరత ఉన్న స్కూళ్లకు సర్దుబాటు చేశారు. ఇక నెలవారీ వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు ప్రభుత్వం వద్ద ఉన్న యు-డైస్ డేటాలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ హెచ్చుతగ్గులను ప్రామాణికంగా తీసుకోనున్నారు. నేరుగా డైరెక్టరేట్ నుంచే సర్‌ప్లస్ టీచర్లను గుర్తించి కొరత ఉన్న పాఠశాలలకు డెప్యుటేషన్లు వేస్తూ సంబంధిత డీఈఓ పేరిట ఉత్తర్వులు జారీ చేస్తారని తెలిసింది. ఇటీవలి వరకు ఇటువంటి డెప్యుటేషన్లను స్థానికంగా ఉన్న కొరత నెలవారీ రిటైర్మెంట్ల వేకెన్సీలను భర్తీ చేసేందుకు సంబంధిత ఎంఈఓలే వేసుకునే వెసులుబాటు ఉండేది. ఇప్పుడు ఆ విధానాన్ని రద్దు చేసి, నేరుగా డైరెక్టరేట్ నుంచే తాత్కాలిక నియామకాలు చేపట్టడానికి రంగం సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో గత నెలలో వెలువడిన మౌఖిక ఆదేశాలు అమలు చేసేలా నెలవారీ సర్దుబాట్ల ప్రక్రియలో సర్‌ప్లస్‌గా వేయనున్నట్లు సమాచారం. దీనిపై ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళనలు నెలకొన్నాయి.

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదు

టీచర్ల నెలవారీ పని సర్దుబాటుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. పిల్లల హాజరుశాతం మాత్రం రోజువారీ ఉంటుంది.

- కిష్టప్ప, జిల్లా విద్యాశాఖాధికారి



సమగ్రాభివృద్ధికి బాటలు

వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు పెద్దపీట

జిల్లా ప్రణాళిక తయారీ





కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, పాల్గొన్న జిల్లా కలెక్టర్ చేతన్

పుట్టపర్తి, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్ కొత్తగా తీసుకొచ్చిన పాలసీల అమలుపై ప్రభుత్వ నివేదికతో జిల్లా ప్రగతికి బాటలు పడనున్నాయి. జిల్లాలో ఆరు నెలల్లో సాధించిన ప్రగతి, రానున్న నాలుగున్నరేళ్లకు నిర్దేశించుకున్న లక్ష్యాలపై యంత్రాంగం రూపొందించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి కలెక్టర్ చేతన్ నివేదించారు. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన రెండురోజులపాటు నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సులో ఆయన పాల్గొన్నారు. తొలిరోజు బుధవారం ఆర్టీజీఎస్, ప్రజాఫిర్యాదుల పరిష్కారం, గ్రామ, వార్డు, సచివాలయాలు, వాట్సాప్ గవర్నెన్స్, ప్రజల్లో సానుకూల దృక్పథం వంటి అంశాలపై చర్చ సాగింది. వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యానవన, పౌరసరఫరాలు, అటవీ, జలవనరులు, పంచాయతీరాజ్ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వ్యవసాయం, అనుబంధ రంగాలతోపాటు పారిశ్రామికాభివృద్ధి, పర్యాటకం, సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు చేపట్టాల్సిన పనులను జిల్లా యంత్రాగం నివేదించింది. ఇందులో జిల్లాలో సాధించాల్సిన పారిశ్రామిక ప్రగతి ప్రధానమైనది. భూముల సేకరణ, పారిశ్రామికవాడల్లో సదుపాయాల కల్పనపై నివేదికలు రూపొందించారు. జిల్లాలో చిలమత్తూరు, మడకశిరలో పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు, ఔత్సాహికులకు ప్రోత్సాహం, ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. జిల్లాను హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌తో అనుసంధానం చేసేలా ఆటోమొబైల్ హబ్‌గా తీర్చిదిద్దాల్సిన అంశాల ప్రణాళికలు సిద్ధం చేశారు. చేనేత రంగాన్ని అభివృద్ధిచేసే దిశ గా ధర్మవరంలో రూ.30 కోట్లతో మెగా చేనేత క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదించారు. పర్యాటక రంగాభివృద్ధిలో భాగంగా శిల్పకళాక్షేత్రం లేపాక్షిలో హరిత రెస్టారెంట్‌లో అదనపు గదుల నిర్మాణం, మడకశిర కోటలో అడ్వెంచర్ స్పోర్ట్స్ అభివృద్ధితోపాటు జిల్లాలో చారిత్రాత్మక సంపద, కళాకృతులు, సంస్కృతిని తెలిపే శిల్పవైభవం, కట్టడాలు, దేవాలయాలు తదితరాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించారు. ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించే దిశగా 12,821 మంది రైతులకు 3419 హెక్టార్లలో సూక్ష్మసేద్యం పరికరాలను సబ్సిడీపై అందించారు. జిల్లాలో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా 257 మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చారు. ఆరు నెలల్లో 5,553 గృహ నిర్మాణాలు చేపట్టాలనీ, వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ 2024-25కు రూ.260.85 కోట్ల ఆదాయార్జనే ధ్యేయంగా పెట్టుకోగా.. ఇప్పటిదాకా రూ.99.94 కోట్లతో 38.31 శాతం పూర్తి చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం స్థూల ఆదాయంలో రాష్ట్రంలో 16వ స్థానంలో జిల్లా నిలిచింది. వ్యవసాయం పరంగా రాష్ట్రస్థాయి లో 15వ, పారిశ్రామికంగా 9వ, సేవల విభాగంలో 18వ ర్యాంకులు జిల్లాకు దక్కాయి. మొదటిరోజు సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర భవిష్యత్తు లక్ష్యాలపై దిశానిర్దేశం చేశారు. పాలసీ బలంగా చేసినా అమలు చేసే బాధ్యత కలెక్టర్లపైనే ఉందని సూచించారు.

డ్రోన్ సాంకేతికతను సద్వినియోగం చేసుకోండి: ఏడీఏ



డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

ఓబుళదేవరచెరువు, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ సాంకేతికతపై రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ సత్యనారాయణ సూచించారు. మండలంలోని నున్నంపల్లి వద్ద రైతు నరసింహులు సాగుచేసిన వేరుశనగ పంటకు డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేశారు. రసం పీల్చే, పూత కొరికే పురుగు నివారణకు అసిటమాప్రైడ్, నీమాయిల్, మల్టిప్లెక్స్ వంటి రసాయనాలను డ్రోన్‌ద్వారా పిచికారీ చేసినట్లు ఏడీఏ తెలిపారు. డ్రోన్‌ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ పంటకు పిచికారీ చేయవచ్చన్నారు. ఎకరాకు రూ.400 అద్దె చెల్లిస్తే ఆరు నిమిషాల్లోనే పిచికారీ పూర్తవుతుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఇలియాజ్ అహమ్మద్, రైతు సేవా కేంద్రం అధికారి రాఘవేంద్రయాదవ్, రైతులు పాల్గొన్నారు.

నీటి సంఘాలకు
ఎన్నికలు
14న పోలింగ్
ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు 7

మత సామరస్యానికి ప్రతీక బాబయ్య దర్గా
రేపు గంధం మహోత్సవం
సర్వమత సమ్మేళనానికి హాజరుకానున్న ప్రముఖులు 7

మైమరపింపజేసిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న భక్తులు

పుట్టపర్తి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా భక్తుల సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రెండోరోజు బుధవారం స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో సంగీత విభావరి నిర్వహించారు. ప్రొఫెసర్ సరస్వతి, విద్యార్థులు సంగీత కచేరీతో భక్తులను అలరింపజేశారు. సేవాదళ్ యువత భక్తిగీతాలు ఆలపించింది. సేవాసంస్థల గుంటూరు జిల్లా అధ్యక్షుడు నరసింహారావు మాట్లాడుతూ.. అక్కడ చేపట్టిన సేవా కార్యక్రమాల గురించి వివరించారు. 980 మంది విద్యార్థులకు విద్యావిహార్ ద్వారా విద్యను అందిస్తున్నామనీ, 6వేల మంది నిరుద్యోగ యువతకు సాంకేతిక శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు చూపించామన్నారు. పశువైద్యశిబిరాలు, ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



సంగీత కచేరీ నిర్వహిస్తున్న ప్రొఫెసర్ సరస్వతి బృందం





ప్రగతి బాట

అమరావతిలో బుధవారం జరిగిన కలెక్టర్ల సమీక్షా సమావేశంలో పాల్గొన్న జిల్లాకు చెందిన మంత్రులు సత్యకుమార్ యాదవ్, పయ్యావుల కేశవ్, సవిత. సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి భోజనం చేస్తున్న అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ వి.రత్న ఇతర ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు. రెండో రోజు ఉమ్మడి జిల్లా అభివృద్ధి, సంక్షేమంపై సమగ్ర సమీక్ష ఉంటుంది.

ఉపాధిలో అగ్రస్థానమే లక్ష్యం

- డ్వామా పీడీ సలీంబాషా



ఇంటర్వ్యూ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపడమే లక్ష్యమని డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. ఉపాధి పథకం కింద చేపడుతున్న పనులు, జిల్లాలో పురోగతి అంశాలపై డ్వామా పీడీ వివరించారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి...?

పీడీ: జిల్లాలో 3.08లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 5.66లక్షల మంది కూలీలు ఉన్నారు. ఎస్సీలకు సంబంధించి 1.26లక్షలు, ఎస్టీ 10,150 జాబ్‌కార్డులు ఉండగా, దివ్యాంగులకు 3826 జాబ్‌కార్డులు ఉన్నాయి.

ప్రశ్న: జిల్లాకు ఈ ఏడాది ఎన్ని పనిదినాలు కేటాయించారు..?

పీడీ: జిల్లాకు 95లక్షల పనిదినాలు కేటాయించారు. ఇప్పటి వరకు 86లక్షల పనిదినాలు పూర్తి చేశాం. రూ.226కోట్లు ఉపాధి కూలీలకు, రూ.104కోట్లు మెటీరియల్ కింద చెల్లించాం.

ప్రశ్న: ఉపాధి కింద ఏయే పనులు చేపడుతున్నారు...?

పీడీ: ఈ ఏడాదిలో పాడి రైతులకు షెడ్ల నిర్మాణం, ఇంకుడుగుంతలు తవ్వడం, ఫారంపాండ్ల నిర్మాణం, సీసీ రోడ్లు వేయడం, డ్రైల్యాండ్ హార్టికల్చర్, పశుగ్రాస క్షేత్రాలు, పల్లె వనాలు, అటవీకరణ, తోపుల పెంపకం చేపడుతున్నాం.

ప్రశ్న: జిల్లాలో డ్రైల్యాండ్ హార్టికల్చర్ పరిస్థితి ఏంటి..?

పీడీ: ప్రధానంగా డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద మొక్కలకు ధరలు పెంచారు. 7500ఎకరాల లక్ష్యానికి గాను 9094ఎకరాలకు మొక్కలు అందజేశాం. రాష్ట్రంలోనే జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. మొక్కల పెంపకం, నీటి నిర్వహణకు లబ్ధిదారులైన రైతులకు ప్రభుత్వమే బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమచేస్తుంది.

ప్రశ్న: ఫారంపాండ్ల నిర్మాణం ఎలా ఉంది...?

పీడీ: ఫారంపాండ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో ఉంది. జిల్లాకు 515సేద్యపు నీటికుంటలు కేటాయించగా...ఇప్పటి వరకు 440పూర్తి చేశాం. వీటితో పాటు ఇంకుడు గుంతల నిర్మాణంలో 283కి గాను 180పూర్తి చేశాం. ఇంకుడు గుంతల నిర్మాణంలో 209కి గాను 203పూర్తి చేశాం.

ప్రశ్న: పశువుల షెడ్ల నిర్మాణం పురోగతి ఎలా ఉంది...?

పీడీ: ఈ ఏడాదిలో కొత్తగా పశువులు, గొర్రెలు, మేకల పెంపకానికి సంబంధించి షెడ్ల నిర్మాణం ప్రారంభించారు. ఇందులో 1475కి గాను 113పూర్తి కాగా మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయి. త్వరలో మిగిలినవి కూడా పూర్తి చేసి పాడి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తాం.

ప్రశ్న: జిల్లాలో వాటర్‌షెడ్ పరిస్థితి ఎలా ఉంది...?

పీడీ: జిల్లాలో వాటర్‌షెడ్ పనులు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే జరుగుతున్నాయి. గోళ్ళ, శింగనమల, రాప్తాడు హంపాపురంలో జరుగుతున్నాయి. తాజాగా రాప్తాడు మండలం హంపాపురం వాటర్‌షెడ్‌కు జాతీయ స్థాయిలో అవార్డు రావడం జిల్లాకు ఎంతో పేరు తీసుకువచ్చింది. ఇదే స్ఫూర్తితో వాటర్‌షెడ్ పనులు మరింత నాణ్యతగా చేపడతాం.



ఉపాధి కూలీలు

సంఘం.. 7 ఏళ్లుగా అడహక్ కమిటీ శరణం..!





- సిబ్బంది సమస్యలు పట్టని నేతలు
- ఒత్తిళ్లకు బలవుతున్న కిందిస్థాయి ఖాకీలు
- పోలీసు అధికారుల సంఘం తీరుపై విమర్శలు

● 'ఒక పని చేసిపెట్టు..' అని అనంతపురం స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఓ హెడ్‌కానిస్టేబుల్‌పై ఆ విభాగం పై అధికారి నాలుగు నెలల క్రితం తీవ్ర ఒత్తిడి చేశారు. భరించలేక ఆ హెడ్‌కానిస్టేబుల్ సెలవు పెట్టి వెళ్లారు.

● సరెండర్ లీవులు, బకాయిలు ఇవ్వాలని కోరుతూ ఏఆర్ విభాగం కానిస్టేబుల్ ప్రకాష్ ఏడాదిన్నర క్రితం డిమాండ్ చేశారు. అప్పటి సీఎం జగన్ జిల్లాకు వచ్చిన సందర్భంలో ప్లకార్డు పట్టుకుని పోలీసు అమరవీరుల స్తూపం ఎదుట బైఠాయించారు. అప్పటి నుంచి అతని మీద యుద్ధం ప్రకటించారు. ఉన్నతాధికారులు పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం ప్రయోగించారు. కేసులు పెట్టి వేధించారు. చివరకు డిస్మిస్ చేశారు.



పోలీస్ అమరవీరుల స్తూపం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రకాష్ (ఫైల్)

అనంతపురం క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇబ్బందులు ఎదుర్కొనే ఉద్యోగులకు వారి సంఘాలు అండగా నిలుస్తాయి. న్యాయం జరిగేలా చూస్తాయి. కానీ పోలీసు అధికారులు సంఘం మాత్రం ఇలాంటి పనిచేయదని బాధితులు వాపోతుంటారు. సెలవులో వెళ్లిన హెడ్ కానిస్టేబుల్‌కు, డిస్మిస్ అయిన ఏఆర్ కానిస్టేబుల్‌కు అండగా నిలవకపోవడం ఇందుకు నిదర్శనం. జిల్లాలో చాలామంది బాధితులు ఉన్నారు. ఎస్‌ఐ, సీఐ, డీఎస్పీ స్థాయి అధికారుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. సంఘం వారి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఎవరి కోసం..?

జిల్లా పోలీసు అధికారుల సంఘం ఆ శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. కానీ ఉన్నతాధికారుల సేవకే పరిమితమౌతోందని విమర్శలు ఉన్నాయి. హోం గార్డు మొదలు ఏఎస్‌ఐ స్థాయివారి గురించి సంఘం అస్సలు పట్టించుకోదనే ఆరోపణలు చాలా సంవత్సరాలుగా ఉన్నాయి. ఏదో నోటిమాటతో అయిపోయే విషయాలపై మాత్రమే, అదీ కొందరికోసమే స్పందిస్తారని బాధితులు అంటున్నారు. అధికారుల ఒత్తిళ్లు, ఇతరత్రా సమస్యలు ఉంటే.. ఆ సమస్య ఎవరిదైనా పట్టించుకోరని వాపోతున్నారు. పోలీసు అధికారుల సంఘం నేతల స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బందిలాగే వ్యవహరిస్తారు. యూనిఫాం వేసుకోవడం వారికి చికాకు అన్నట్లు ప్రవర్తిస్తారు. డీజీపీ వచ్చినప్పుడో, కొత్తగా ఎస్పీ బాధ్యతలు తీసుకునే సమయంలోనో మినహా.. వారి ఒంటిపై ఖాకీ దుస్తులు కనిపించవు. పోలీసు సిబ్బంది మృతి చెందిన సమయంలో పోలీసు లాంఛనాలతో వారి అంత్యక్రియలు నిర్వహిస్తారు. అక్కడ కూడా వీరు యూనిఫాంలో కనిపించరు.

సత్కరించడమే పనా..?

ఉన్నతాధికారులకు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేయడం, చిన్న పని చేస్తే సత్కరించడమే సంఘం విధి అన్నట్లుగా తయారైంది. వైసీపీ హయాంలో పోలీసులకు డీఏ, సరెండర్ లీవులు తదితర సమస్యల గురించి సంఘం పట్టించుకున్న దాఖలాలు లేవు. వైసీపీ అధికారంలోకి రాకముందు పోలీసులకు వీక్లీ ఆఫ్‌లు అని ఆ పార్టీ అధినేత ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక కొన్ని నెలలు మాత్రమే అమలు చేసి.. అటకెక్కించారు. దీని గురించి కూడా ప్రశ్నించలేదు. కనీసం వినతిపత్రం ఇవ్వలేదు. ప్రశ్నించేవారికి పోలీసు అధికారుల సంఘంలో చోటు ఉండదనే ప్రచారం ఉంది. అందుకే హోదా ఉంటే చాలు.. సమస్యల గురించి ప్రస్తావించి ఇబ్బంది పడటం ఎందుకని మిన్నకుండిపోతున్నారని ప్రచారం ఉంది. ఏఆర్ కానిస్టేబుల్ ప్రకాష్‌ను శాఖ పరంగా తీవ్ర ఇబ్బందులు పెట్టారు. రుజువులు లేని కేసులో ఇరికించి డిస్మిస్ చేశారు. అందరి సమస్యలపై గళం విప్పినందుకు ఉద్యోగాన్ని పోగొట్టుకున్నాడు. అతనిపట్ల కనీస సానుభూతి చూపించలేదు. కాపాడే ప్రయత్నం అస్సలు చేయలేదు. సంఘం జోక్యం చేసుకుని ఉంటే.. ప్రకాష్‌కు ఆ పరిస్థితి ఎదురయ్యేదా..?

ఏడేళ్లుగా అడహక్ కమిటీ

పోలీస్ అధికారుల సంఘం పేరుతో ఒకే కమిటీ ఏడేళ్లుగా నడుస్తోంది. ఒకే కమిటీ ఇన్నేళ్లు కొనసాగడం విమర్శలకు తావిస్తోంది. తనకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వకపోవడంపై పోలీస్ అధికారుల సంఘం మాజీ అధ్యక్షుడు శివానంద ఏడేళ్ల క్రితం కోర్టును ఆశ్రయించారు. దీంతో ఎన్నికలపై కోర్టు స్టే విధించింది. అప్పటి నుంచి పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీతోనే నడుస్తోంది. తాత్కాలిక కమిటీని ఏడేళ్లుగా, ఎలాంటి మార్పులు లేకుండా కొనసాగించడం ఏమిటని పోలీసు శాఖ అధికారులు, సిబ్బందే ప్రశ్నిస్తున్నారు. కొత్త కమిటీ ఎన్నికైతే కొంతైనా మార్పు ఉంటుందని వారు అంటున్నారు. పోటీ ఉంటే పోలీస్ సిబ్బంది సమస్యలపై పోరాడే నాయకత్వం వస్తుందని అంటున్నారు. అండగా నిలబడే సంఘం కోసం పోలీసు బాధితులు ఎదురుచూస్తున్నారు.



హెడ్‌కానిస్టేబుల్ అంత్యక్రియల్లో యూనిఫాం లేకుండా నిల్చున్న పోలీస్ అధికారుల సంఘం నాయకులు(ఫైల్)

రూ.1000కి ఏమొస్తుంది..?

డీఎస్సీ అభ్యర్థులకు మెటీరియల్ సమస్య



- మార్కెట్‌లో కొనడానికి నగదు అందజేత ?
- రూ.వెయ్యి ఇచ్చేందుకు నిర్ణయం
- బయటి మార్కెట్లో ధర రూ.2వేల పైమాటే
- ఆందోళనలో అభ్యర్థులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమశాఖ రాష్ట్ర అధికారులు అనాలోచిత నిర్ణయాలతో డీఎస్సీ ఉచిత శిక్షణ సక్రమంగా అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శిక్షణ సమయంలో అభ్యర్థులకు అందించే స్టైఫండ్, మెటీరియల్ విషయంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని కనబరుస్తున్నారు. డీఎస్సీ మెటీరియల్‌కు సంబంధించి బహిరంగ మార్కెట్లో ఉన్న ధరలు పట్టించుకోకుండా కేవలం రూ.1000 అని నిర్ణయించేశారు. శిక్షణ అందించే ఫ్యాకల్టీ పారితోషికం విషయంలోనూ అదే నిర్లక్ష్యాన్ని వహించారు. వారికి సెషన్‌కి కేవలం రూ.600 అని చెప్పి ఆదేశాలు జారీ చేశారు. దీంతో అభ్యర్థులు, ఫ్యాకల్టీ సిబ్బంది ఇబ్బంది ఇబ్బంది పడుతున్నారు.



మెటీరియల్‌కు బదులు డబ్బు

గతంలో బీసీ స్టడీ సర్కిల్ ద్వారా అందించే డీఎస్సీ ఉచిత శిక్షణకు సంబంధించి ఆ శాఖాధికారులే స్టడీ మెటీరియల్‌ను అందించేవారు. అభ్యర్థులు ఆ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకునేవారు. వీటికి తోడు స్టైఫండ్ సైతం అందించేవారు. ఈసారి మాత్రం ఆ శాఖ రాష్ట్ర అధికారులు అభ్యర్థులకు స్టైఫండ్ నెలకు రూ. 1500 ఇవ్వడం లేదు. అలాగే మెటీరియల్‌కు బదులు నగదును అందించేందుకు శ్రీకారం చుట్టారు. ఒక్కో అభ్యర్థికి రూ.వెయ్యి చొప్పున అందించనున్నట్లు తెలిపారు. అయితే బహిరంగమార్కెట్లో మెటీరియల్ ధర చాలా ఎక్కువగా ఉంది. స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించిన మెటీరియల్ దాదాపు రూ. 2500 వరకూ ఉంది. ఎస్‌జీటీలకు సంబంధించిన మెటీరియల్ ధర రూ. 3 వేలకుపైమాటే. దీంతో ప్రభుత్వం ఇచ్చే రూ.వెయ్యితో ఏమి కొనుక్కోవాలని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

ఫ్యాకల్టీకి ఆరు వందలే..

బీసీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ ఇచ్చే ఫ్యాకల్టీకి అందించే పారితోషికంలోనూ కోత పెట్టారు. సెషన్‌కు రూ. 600లు మాత్రమే ఇస్తున్నారు. బయటి కోచింగ్ సెంటర్లలో సెషన్‌కు రూ. 2వేలు, రూ. 3వేలు ఇస్తున్నారు. దీంతో ఇక్కడ కోచింగ్ ఇవ్వడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో నిపుణులైన ఫ్యాకల్టీని పిలుచుకుని వచ్చేందుకు బీసీ స్టడీ సర్కిల్ అధికారులు నానా తంటాలు పడుతున్నారు. బలవంతంగా ముగ్గురు, నలుగురు ఫ్యాకల్టీలతో నెట్టుకొస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గైడ్‌లైన్స్ మేరకే...

రాష్ట్ర అధికారులు ఇచ్చిన మార్గదర్శకాల మేరకే ఉచిత డీఎస్సీ శిక్షణను అమలు చేస్తున్నాం. మెటీరియల్‌కు సంబంధించిన మొత్తాన్ని అభ్యర్థుల ఖాతాలకు జమ చేసేలా రాష్ట్ర అధికారులు నిర్ణయించారు. అభ్యర్థులకు మేము మెటీరియల్ ఇవ్వడం లేదు. రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాల మేరకే స్టైఫండ్‌తో పాటు మెటీరియల్‌కు సంబంధించిన రూ. వెయ్యి ఖాతాలకు జమవుతుంది.

- కుష్బూ కొఠారీ, డైరెక్టర్, బీసీ స్టడీసర్కిల్

ప్రభుత్వ బియ్యాన్ని అమ్ముకోరాదు

ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి



రాప్తాడు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజనం రుచి చూస్తున్న విజయ్ ప్రతాప్‌రెడ్డి

రాప్తాడు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఉచిత బియ్యాన్ని అమ్ముకోరాదని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మండలంలోని కేజీబీవీ, రాప్తాడు ఉన్నత పాఠశాల, గంగలకుంట అంగన్‌వాడీ కేంద్రం, రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వాలు కిలో రూ. 45 ప్రకారం రైతుల నుంచి కొనుగోలు చేసి రాష్ట్రంలోని దాదాపు 4 కోట్ల మంది ప్రజలకు బియ్యం అందిస్తున్నాయన్నారు. ప్రభుత్వం అందించే బియ్యాన్ని ప్రజలు చులకనగా చూస్తూ కిలో రూ. 13కే అమ్ముకుంటున్నారన్నారు. ప్రభుత్వం అందించే బియ్యం ఎంతో నాణ్యతగా ఉంటాయని, మంచి విటమిన్లు ఉంటాయన్నారు. ఆ బియ్యం అమ్ముకోకుండా రాగిముద్ద, పిండి వంటలు, దోసెలు, వడియాలు, టిఫిన్‌లకు ఉపయోగించుకోవాలన్నారు. ప్రజలు అమ్మిన బియ్యాన్ని వ్యాపారస్థులు సన్న బియ్యంగా మార్చి విదేశాలకు విక్రయిస్తున్నారన్నారు. ఆ సన్న బియ్యం తిరిగి ప్రజలు రూ. 60 కొంటున్నారన్నారు. కేజీబీవీలో మధ్యాహ్న భోజనం బాగుందని తెలిపారు. గంగలకుంట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. రాప్తాడు ఉన్నత పాఠశాలలో కూర నీళ్లగా ఉందని భోజన నిర్వాహకులను మందలించారు. కార్యక్రమంలో జీసీడీఓ వాణిదేవి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సీడీపీఓ ధనలక్ష్మి, డీఈఓ ప్రసాద్‌బాబు, డీఎస్‌ఓ రమేష్ బాబు, ఎంఈఓ మల్లికార్జున, హెచ్‌ఎం సాంబశివ, ఎస్‌ఓ ముత్యాలమ్మ, డాక్టర్ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బేడబుడగజంగాల సమస్యలు పరిష్కరించండి

కేంద్ర ప్రభుత్వం సోషల్ జస్టిస్ సెక్రటరీకి ఎంపీ వినతి

అనంతపురం అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బేడ, బుడగ కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం సోషల్ జస్టిస్ సెక్రెటరీ అమిత్ యాదవ్‌ను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఢిల్లీలో బుధవారం ఆయన బేడ, బుడగ సంఘాల నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. 16 సంవత్సరాలుగా ఎలాంటి కుల ధ్రువీకరణ పత్రం పొందకుండా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలకు దూరంగా ఉంటున్న బేడ, బుడగ కులస్థులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. బేడ, బుడగ కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసేందుకు 2017లో సీఎం చంద్రబాబునాయుడు జేసీ శర్మ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. ఆ కమిషన్ అన్ని జిల్లాలో పర్యటించి 2018లో నివేదికలు సమర్పించిందన్నారు. 2019లో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ఆ నివేదికలు పంపిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని బేడ, బుడగ కులస్థులకు ఎస్సీ సర్టిఫికెట్లు అందేలా చూడటంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు.



కేంద్ర ప్రభుత్వం సోషల్ జస్టిస్ సెక్రటరీకి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా

వదాన్య డీఎస్సీ హాల్ టిక్కెట్ల విడుదల

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే డీఎస్సీ ఎస్‌జీటీ మెగా గ్రాండ్ టెస్టుకు సంబంధించిన హాల్ టిక్కెట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు ఆ సొసైటీ ఫౌండర్ అశోక్ వడపాటి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచే హాల్‌టిక్కెట్లు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లా వ్యాప్తంగా 2110 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. డిసెంబరు 29న కొత్తచెరువులో పరీక్ష నిర్వహిస్తామన్నారు. హాల్‌టిక్కెట్ల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన మొదటి 50 మందికి నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినా అంతేనా..?

ఏపీఓ నాగరాజుపై చర్యలేవీ..?

- తేలిగ్గా తీసుకున్న విద్యాశాఖ అధికారులు
- ఏఎస్‌ఓ పోస్టు కట్టబెట్టే యత్నం



అనంతపురం విద్య, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఇష్టారాజ్యం నడుస్తోంది. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ అధికార పార్టీ ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వైసీపీ పాలనలో జిల్లా విద్యాశాఖలోకి ఏపీఓగా వచ్చిన నాగరాజుపై గతంలో ఉపాధ్యాయుల నుంచి అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు పలు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయన విషయాన్ని ఆరాతీసి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సెప్టెంబరు నెలలో లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. 'ఏపీఓ నాగరాజు ఉపాధ్యాయుల సర్దుబాటులో మిగులు ఉపాధ్యాయులకు మంచి స్థానాలు కావాలంటే నన్ను కలవండి. మంచి ప్లేస్ ఇప్పిస్తానంటూ టీచర్ల నుంచి కొంత మొత్తం తీసుకున్నట్లు తన దృష్టికి వచ్చిందని' ఫిర్యాదులో ఎమ్మెల్యే పేర్కొన్నారు. టీచర్లు అదే స్కూల్‌లో కొనసాగాలన్నా కూడా తనను సంప్రదిస్తే చాలు అంటూ ఏపీఓ మోసం చేస్తున్నారంటూ కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో ఎమ్మెల్యే పేర్కొన్నారు. అయితే రెండు మాసాలు కిందటే అధికార పార్టీ ఎమ్మెల్యే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా...ఇప్పటి వరకూ ఏపీఓపై జిల్లా విద్యాశాఖాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

కమిషనర్ చెప్పినా.. కదిలించరా...?

వైసీపీ పాలనలో నాగరాజు ఏపీఓగా డీఈఓ ఆఫీస్‌కు వచ్చారు. గత ప్రభుత్వంలో వచ్చిన ఉపాధ్యాయులను కదిలించి కొత్త వాళ్లను తీసుకోవాలంటూ విద్యాశాఖ కమిషనర్ అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ఇదే విషయాన్ని ఇటీవల కూడా కమిషనర్ డీఈఓలను ఆదేశించారు. ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినా, విద్యాశాఖ కమిషనర్ చెప్పినా జిల్లా విద్యాశాఖాధికారులు పెడ చెవిన పెట్టడం అనేక విమర్శలకు తావిస్తోంది. ఏపీఓగా పనిచేస్తున్న ఆయనను కీలకమైన అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ (ఏఎస్‌ఓ) పోస్టులో కూర్చోబెట్టాలని కొందరు గట్టిగా పైరవీలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఆ దిశగా ఫైల్‌ను కదిలిస్తున్నట్లు సమాచారం.



శబరిమలకు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్ మీదుగా శబరిమలకు సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు-కొల్లాం ప్రత్యేక రైలు (నం. 07181) జనవరి 4, 11, 18 తేదీల్లో రాత్రి 11-45 గంటలకు గుంటూరులో బయలుదేరి 6, 13, 20 తేదీల్లో ఉదయం 6-20 గంటలకు కొల్లాంకు చేరుకుంటుందన్నారు. అలాగే కొల్లాం-గుంటూరు ప్రత్యేక రైలు (నం. 07185) జనవరి 13, 20 తేదీల్లో ఉదయం 10-45 గంటలకు కొల్లాంలో బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 4 గంటలకు గుంటూరుకు చేరుకుంటుందన్నారు. ఈ రైళ్లు నరసరావుపేట, దొనకొండ, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, దిగువమిట్ట, నంద్యాల, బేతంచెర్ల, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లి, పీలేరు, పాకాల, చిత్తూరు, కాట్పాడి, జోలార్‌పట్టై, సేలం, ఈరోడ్, తిరుప్పూరు, పొదనూరు, పలక్కడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం టౌన్, ఎట్టుమనూర్, కొట్టాయం, తిరువల్ల, చెంగనూరు, కాయంకుళం స్టేషన్ల మీదుగా వెళ్తాయన్నారు. కొల్లాం-కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు (నం. 07182) జనవరి 2న ఉదయం 10-45 గంటలకు కొల్లాంలో బయలుదేరి మరుసటిరోజు రాత్రి 10 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు కాయంకుళం, చెంగనూరు, తిరువల్ల, కొట్టాయం, ఎట్టుచలయెర్, ఎర్నాకులం టౌన్, అలువ, త్రిసూర్, పలక్కడ్, పొదనూరు, తిరుప్పూర్, ఈరోడ్, సేలం, జోలార్‌పట్టై, కాట్పాడి, చిత్తూరు, పాకాల, పీలేరు, మదనపల్లి, కదిరి, ధర్మవరం, అనంతపురం, గుత్తి, డోన్, బేతంచెర్ల, నంద్యాల, దిగువమెట్ట, గిద్దలూరు, మార్కాపురం రోడ్డు, దొనకొండ, నరసరావుపేట, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

వైద్యులు.. సిబ్బందికి మెమో



రోగితో మాట్లాడుతున్న డీసీహెచ్ డాక్టర్ రవికుమార్

శింగనమల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ విధులకు గైర్హాజరైన ఐదుగురు వైద్యులు, నలుగురు వైద్య సిబ్బందికి డీసీహెచ్ డాక్టర్ పాల్ రవికుమార్ మెమో జారీ చేశారు. సీహెచ్‌సీనిఆయన బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు ఆసుపత్రిని పరిశీలించారు. ఔషధాల కొరత, సిబ్బంది పని తీరు గురించి విచారించారు. అస్పత్రిలో 24 గంటలు సేవలు అందించాలని, కానీ వైద్యులు, సిబ్బంది అలసత్వం వహిస్తున్నారని అన్నారు. రాత్రి సమయంలో వైద్యులు విధులకు సరిగా హాజరు కావడం లేదని అనానరు. రోగుల పట్ల వైద్య సిబ్బంది అనుచితంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

న్యూస్‌బాక్స్

827 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 827 క్యూసెక్కుల వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్-2కు 891 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.672 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.16

అనంతపురం రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.16తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. బుధవారం మార్కెట్‌కు 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.12, కనిష్ఠ ధర రూ.7పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.38వేలు

అనంతపురంరూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.38,290, కనిష్ఠంగా రూ.13 వేలు, సరాసరి రూ.30వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 42టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

అరుణాచలం వెళ్లే భక్తులకు పోలీసుల సూచన

అనంతపురం క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై అరుణాచలేశ్వర దేవాలయంలో ఈ నెల 13న మహాదీపం, గిరి ప్రదక్షిణ(గిరి వలం)కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మన రాష్ట్రం నుంచి వెళ్లే భక్తుల కోసం తిరువణ్ణామలై పోలీసులు కొన్ని సూచనలు చేశారు. తిరుపతి, చిత్తూరు రహదారుల నుంచి వెళ్లే ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల కోసం వెల్లూరు రోడ్డులోని తాయి ముగాంబికా నగర్, తిరువణ్ణామలై బైపాస్ రోడ్డు సమీపంలో ఏకేఎస్ నగర్‌లలో 2 తాత్కాలిక బస్టాండు, వెల్లూరు రోడ్డులో 13 తాత్కాలిక కారు పార్కింగ్‌లను ఏర్పాటు చేశారు. 9363622330 నెంబర్ ద్వారా హలో అని పంపితే రూట్ మ్యాప్ లింక్స్ పంపుతామని తిరువణ్ణామలై జిల్లా పోలీస్‌లు ప్రకటించారు. రోడ్డు పక్కన వాహనాలు పార్కింగ్ చేయరాదని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదమని అనిపిస్తే సమీపంలోని ఉన్న పోలీసులకు తెలియజేయవచ్చన్నారు. భక్తులకు వైద్యపరంగా సహాయం అందించడానికి ప్రత్యేకంగా ఈనెల 12 ఉదయం 7గంటల నుంచి 15 సాయంత్రం ఆరుగంటల వరకు అందుబాటులో ఉన్న మే ఐ హెల్ప్ యూ బూత్‌లోని పోలీసులను సంప్రదించవచ్చు.

నీటి సంఘాలకు ఎన్నికలు

14న పోలింగ్

ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



హెచ్చెల్సీ

అనంతపురం క్లాక్‌టవర్/పుట్టపర్తి టౌన్/కదిరి అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నిలకు ఎట్టకేలకు షెడ్యూల్ ప్రకటించారు. హెచ్చెల్సీ పరిధిలో 99, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 95 మొత్తం 194సాగునీటి సంఘాలకు ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన ఎన్నికలను ఈ సారి కచ్చితంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. ఈనెల 14న సాగునీటి సంఘాల ఎన్నికలు పూర్తి చేయాలని తాజాగా కొత్త షెడ్యూల్ విడుదల చేశారు. అదే రోజు ఎన్నికల అనంతరం సర్వసభ్యసమావేశాలు నిర్వహించనున్నారు. 17న జిల్లాలోని హెచ్‌ఎల్‌ఎంసీ, మిడ్ పెన్నార్ సౌత్‌కెనాల్, మిడ్ పెన్నార్ నార్త్ కెనాల్, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్, గుంతకల్లు బ్రాంచ్‌కెనాల్, ఆలూరు బ్రాంచ్ కెనాల్‌తో పాటు డిస్ట్రిబ్యూటరీల కమిటీలను ఎన్నుకుంటారు. అలాగే తుంగభద్ర, భైరవానితిప్ప ప్రాజెక్ట్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల కమిటీలను ఎన్నుకోనున్నారు.

194 సంఘాలకు ఎన్నికలు

జిల్లాలో మొత్తం 194సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. తుంగభద్ర ప్రాజెక్ట్ ఎగువ కాలవ (టీబీపీ హెచ్చెల్సీ) పరిధిలో 99సాగునీటి సంఘాలను గుర్తించారు. ఇందులో హెచ్‌ఎల్‌ఎంసీ 11 సాగునీటి సంఘాలకు 35,541ఎకరాల ఆయకట్టు ఉంది. మిడ్‌పెన్నార్ నార్త్ కెనాల్ ఐదు సంఘాలకు 13,325 ఎకరాలు, మిడ్ పెన్నార్ సౌత్ కెనాల్‌కు 10సంఘాలకు 29,577ఎకరాల ఆయకట్టు ఉంది. తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ కింద 9 సంఘాల కింద 25,478ఎకరాల ఆయకట్టు ఉంది. గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ పరిధిలో 11సంఘాల కింద 32,072 ఎకరాలు, కర్నూలు జిల్లాలోని ఆలూరు బ్రాంచ్ కెనాల్ 14,255ఎకరాల ఆయకట్టుకు ఆరు సంఘాలు ఉన్నాయి. కడప జిల్లాలోని జమ్మలమడుగు 10సంఘాలకు 22,625ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రొద్దుటూరు 10 సంఘాలకు 24,524ఎకరాలు ఉంది. ఎర్రగుంట్ల 9సంఘాలకు 23,392 ఎకరాలు, కనసూరు 5సంఘాలకు 8,843ఎకరాలు, సింహాద్రిపురం 8సంఘాలకు 24,670ఎకరాలు, ఆచ్వవల్లి 5సంఘాలకు 16,507ఎకరాల ఆయకట్టు ఉంది. మొత్తం హెచ్చెల్సీ కింద 99సాగునీటి సంఘాల పరిధిలో 2,70,809 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో అనంతపురం జిల్లాలో 5డిస్ట్రిబ్యూటరీ సంఘాల పరిధిలో 46సాగునీటి సంఘాలు, కర్నూలు ఒక డిస్ట్రిబ్యూటరీ కింద 6సాగునీటి సంఘాలు, కడపలో 6డిస్ట్రిబ్యూటరీలు కింద 47సాగునీటి సంఘాలు ఉన్నాయి. మొత్తం హెచ్చెల్సీ పరిధిలో 12డిస్ట్రిబ్యూటరీల కింద 99సాగునీటి సంఘాలను గుర్తించారు. మైనర్ ఇరిగేషన్ పరిధిలో జిల్లాలో 95సాగునీటి సంఘాలు ఉన్నాయి. వీటిలో మేజర్ ప్రాజెక్ట్‌గా భైరవానితిప్ప (బీటీపీ) ప్రాజెక్ట్ కింద 6 చెరువులు 89 సాగునీటి సంఘాలు ఉన్నాయి.

ఒక్కో అసోసియేషన్‌కు 20-50 ఎకరాల ఆయకట్టు రైతులు ఓటర్లుగా టీసీని ఎన్నుకుంటారు. టీసీ (టెరిటోరియల్ కాన్‌స్టెన్సీ)లు కనీసం 6-12 మంది కలిసి వాటర్ యూజర్ అసోసియేషన్‌లో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లను ఎన్నుకుంటారు.

శ్రీసత్యసాయి జిల్లాలో...


శ్రీసత్యసాయి జిల్లాలో 216 మైనర్‌ఇరిగేషన్ చెరువులు, 16 మధ్యతరహా ప్రాజెక్టులున్నాయి. మొత్తం 230 సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లాలో అన్ని చెరువులకు కలిసి 77,454మంది ఓటర్లు ఉండగా, 1,476 మంది ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యులు ఎన్నిక కానున్నారు. మైనర్ ఇరిగేషన్ చెరువు, సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఆరు గురు ప్రాదేశిక నీటిసంఘల సభ్యులను ఎన్నుకుంటారు. వారిలో ఒకరిని అధ్యక్షులు, మరొకరిని ఉపాధ్యక్షులుగా ఎన్నుకుంటారు. అలాగే మధ్యతరహా ప్రాజెక్టులో 12మంది ప్రాదేశ నియోజకవర్గ సభ్యులుంటారు. వీరిలోనే అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు.

కూటమిలో పోటాపోటీ, వైసీపీలో నైరాశ్యం

జిల్లా వ్యాప్తంగా ఈనెల 14న జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయడానికి టీడీపీ కూటమి నేతల్లో తీవ్ర పోటీ నెలకొంది. సార్వత్రిక ఎన్నికల తరువాత మొదటిసారి వస్తున్న ఎన్నికలు కావడంతో సాగునీటి సంఘాల అధ్యక్షులు కావడానికి కూటమి నేతలు పోటీ పడుతున్నారు. జిల్లాలోని అన్ని సాగునీటి అధ్యక్ష స్థానాలను ప్రాదేశిక నియోజకవర్గ స్థానాలను ఏకగ్రీవంగా కైవసం చేసుకోడానికి కూటమి నేతలు వ్యూహాలు పన్నుతున్నారు. కాగా సార్వత్రిక ఎన్నికల్లో ఘోర ఓటమితో వైసీపీ నాయకులు సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయడానికి జంకుతున్నారు. ఒకటి రెండుచోట్ల పోటీచేయాలని కిందిస్థాయి కార్యకర్తలు, సానుభూతి పరులు ఉత్సహంగా ఉన్నా, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండలస్థాయి నాయకులు మనకెందులే అన్న ధోరణిలో ఉన్నారు.

తొమ్మిదేళ్ల అనంతరం..

వివిధ కారణాలతో రెండు సార్లు వాయిదా పడిన సాగునీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో గ్రామాలలో సాగునీటి సంఘాల ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికలకు సంబంధించి రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఓటరు జాబితాలను విడుదల చేశారు. గత ప్రభుత్వంలో ఎన్నికలు జరపకపోవడంతో పూడిక తీత పనులు, మరమతులు, కాలువ గట్ల బలోపేతం వంటి క్షేత్రస్థాయి ముఖ్యమైన పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇప్పుడు సాగునీటి సంఘాలకు టీడీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధం అయ్యింది. 2015 అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ సంఘాలకు నామినేషన్ పద్ధతిలో చైర్మన్లను నియమించిన విషయం తెలిసిందే. వారి పదవీ కాలం పూర్తయిన తర్వాత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించ లేదు. ఇరిగేషన్ అధికారులతోనే పనులు చక్కబెట్టింది. దీంతో నిర్వహణ గాడి తప్పింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నీటి సంఘాల పాధాన్యతను గుర్తించి, ఎన్నికల నిర్వహణకు ఆదేశాలిచ్చింది.



నిండుకుండలా బుక్కపట్నం చెరువు

అక్రమాలకు అడ్డుకట్ట

చెరువుల్లో అక్రమంగా మట్టి తోలకపు నియంత్రణనకు సాగునీటి సంఘాలు దోహదపడతాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే సాగునీటి అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించేవిధంగా సంఘాలు పర్యవేక్షిస్తాయి.

-నాగరాజు, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు, పట్నం

పకడ్బందీగా ఏర్పాట్లు

ఈనెల 14న జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే మైనర్ ఇరిగేషన్ చెరువులకు చెందిన ఓటర్ల జాబితాను సిద్ధం చేశాం. రైతుల అభిప్రాయాల మేరకు అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాల ఎన్నిక నిష్పక్షపాతంగా నిర్వహిస్తాం. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేశాం.


- రాధాకృష్ణ, ఇరిగేషన్ ఈఈ

మత సామరస్యానికి ప్రతీక బాబయ్య దర్గా

13న గంధం మహోత్సవం

సర్వమత సమ్మేళనానికి హాజరుకానున్న ప్రముఖులు

పెనుకొండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాబయ్యస్వామి దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. హిందూముస్లింల ఐక్యతకు చిహ్నం. దక్షిణ భారతదేశంలోనే పరమ పవిత్రమైన దర్గాల్లో ఇదొకటి. ఏటా బాబయ్య స్వామి ఉరుసు నిర్వహిస్తారు. విదేశాల నుంచి సైతం భక్తులు తరలివస్తారు. తాజాగా స్వామి వారి 752వ ఉరుసు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో ప్రధానమైన గంధపు పూజ మహోత్సవం ఈనెల 13న ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా తెలిపారు. 14న దీపారాధన, 15న ఫకీర్ల ప్రదర్శన, 16న ధూళిపరుష, 17న ఖాజా సయ్యద్‌షా మస్తాన్ హుసేన్ గంధం పూజ, 18న సయ్యద్ బీదర్‌షావలి గంధంపూజ నిర్వహిస్తారు. 19న అర్మాన్, ఫకీర్లు ఇతర ఉరుసులకు వెళ్లిపోతారు. గంధంపూజ రాత్రి ఖవాలీ మందిరం సమీపంలో రాత్రి 9గంటల నుంచి ఇంటిగ్రేటెడ్ నేషనల్ సెమినార్ (సర్వమత సమ్మేళనం) నిర్వహిస్తారు. ప్రభుత్వం తరఫున బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత చాదర్ సమర్పిస్తారు. ముఖ్య అతిథులుగా మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫారూక్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మైనార్టీ వ్యవహారాల సలహాదారు షరీఫ్ మహ్మద్ అహ్మద్, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, రాష్ట్ర ముతవల్లీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు షకీల్ షఫీ, కలెక్టర్ చేతన్, కర్నూలు రేంజ్ ఏఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీ హాజరవుతారన్నారు.



పెనుకొండ బాబయ్య దర్గా ముఖద్వారం



బాబయ్యస్వామి సమాధి

దర్గా చరిత్ర

స్వామి చరిత్రను గ్రంధం రూపంలో లిఖించారు. బాబా ఫకృద్దీన్ జన్మస్థలం ఇరాన్ దేశంలోని శిస్థాన్ పట్టణం. ఈయన చక్రవర్తిగా రాజ్యపాలన చేస్తున్న సమయంలో ఒక రోజు గుర్రపు స్వారీపై తనకున్న వ్యామోహంతో న్యాయం కోసం వచ్చిన బాధితులను నిర్లక్ష్యం చేస్తాడు. చేసిన తప్పునకు పశ్చాత్తాపంతో మత గురువుల ఆదేశానుసారం రాజ్యాన్ని త్యజించి, పాప విమోచనం కోసం దేశాటనకు బయలుదేరి వెళ్లాడు. దేశవిదేశాలు తిరిగి భారతదేశం చేరతాడు. తమిళనాడులోని తిరుచనాపల్లికి వస్తారు. అక్కడ హజ్రత్ సత్తేహార్ తబ్రే ఆలం బాద్‌షాను గురువుగా స్వీకరిస్తారు. పెనుకొండకు వెళ్లమని గురువుకు ఆదేశించి, అదే తన నివాస స్థలమన్నారు. అక్కడే ఉండి సర్వమానవ సౌభ్రాతృత్వం, శాంతి, సామరస్యం గురించి ప్రజలకు బోధించాలని గురువు ఆదేశిస్తారు. అందుకు బాబా దుఃఖిస్తూ పెనుకొండ ఎక్కడ ఉందో తనకు తెలియదని గురువును వేడుకుంటారు. అందుకు తాను దంతాలు తోముకుంటున్న కట్టిపుల్లను బాబాకు ఇస్తారు. దేశ సంచారం చేస్తూ రాత్రిపూట నిద్రించే స్థలంలో పుల్లను భూమిలో నాటాలనీ, మరుసటిరోజు చిగురిస్తే అదే స్థిర నివాసమని గరువు ఉపదేశిస్తారు. బాబా దేశాటన చేస్తూ కర్ణాటక, తమిళనాడు, పలు ప్రాంతాలు తిరిగారు. చివరకు పెనుకొండకుచేరుకుంటారు. కోట బయట తూర్పున ఆనుకుని ఉన్న మండపంలో బస చేశారు. రాత్రి నిద్రించే సమయంలో తన వెంట తెచ్చుకున్న పుల్లను భూమిలో నాటి ఉదయం లేచి చూస్తారు. అది చిగురించి ఉండటాన్ని గమనిస్తారు. గురువు నిర్దేశించిన స్థలం ఇదేనని అక్కడే బాబా స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. బాబయ్యస్వామి తమ దేవాలయ మండపంలో బాబాఫక్రుద్దీన్ అనే ముస్లిం ఫకీర్ ఉండటానికి హిందూ మతపెద్దలు జీర్ణించుకోలేకపోయారు. తీవ్రంగా వ్యతిరేకిస్తూ రాజుకు ఫిర్యాదు చేస్తారు. ఇరువర్గాల వాదన విన్న మహారాజు బాబాఫకృద్దీన్‌కు హిందూ మతపెద్దల మధ్య పోటీ నిర్వహిస్తారు. పోటీలో బాబా గెలుపొంది, మండపాన్ని స్థిర నివాసంగా పొందుతారు. ప్రతి రోజూ మతసామరస్యంగా తమ మహిమలను చూపుతారు. దీర్ఘకాలిక రోగాలను నయం చేస్తారు. దీంతో స్వామిని హిందూవులు కూడా కొలిచేవారు. బాబయ్యస్వామిగా ఖ్యాతి పొందిన బాబాఫకృద్దీన్ క్రీ.శ. 694 సంవత్సరంలో పరమపదించారు. ఆ స్థలంలోనే బాబాను సమాధి చేశారు. ప్రస్తుతం ఆయన సమాధే ప్రఖ్యాతి చెందిన బాబయ్య దర్గా. అక్కడే ఏటా ఉరుసు ఉత్సవాలను భారీఎత్తున నిర్వహిస్తారు.

కూలీల ఆటో బోల్తా

ఒకరికి తీవ్రగాయాలు

యల్లనూరు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రిద్దమ్మబావి సమీపంలో బుధవారం తెల్లవారుజామున కూలీలను తీసుకువెళ్తున్న ఆటో బోల్తా పడటంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పుట్లూరు మండలం గోపరాజుపల్లికి చెందిన గోపాల్ మరో పదిమంది కలిసి ఆటోలో కడపజిల్లా బలపనూరుకు తోట చుట్టూ ఫెన్సింగ్ వేసే పనికి బయల్దేరారు. గ్రిద్దమ్మబావి సమీపం లోకి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణి స్తున్న గోపాల్ తీవ్రంగా గాయపడగా మిగిలిన వారు స్వల్పగాయాలతో బయటప డ్డారు. క్షతగాత్రులను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

పామిడి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండూరు రోడ్డు పక్కన ఓ మామిడి తోటలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ ప్రసాద్, సీఐ జమాల్‌బాషా తెలిపిన మేరకు... రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై నిరుపేదలకు సరఫరా చేస్తున్న బియ్యాన్ని కొందరు అక్రమంగా మామిడి తోటలో నిల్వ చేశారని సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో సుమారు 200 బస్తాల రేషన్ బియ్యంను కనుగొన్నామన్నారు. వెంటనే ఆ బియ్యాన్ని సీజ్ చేసి, సీఎస్‌డీటీ కంబక్కకు అప్పగించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడాపురం గ్రామానికి చెందిన ఆనంద్(45)బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు ఆనంద్ స్థానికంగా ఓ చికెన్ సెంటర్‌లో పని చేసేవాడు. ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించి కారణాలు ఆరాతీశారు. భార్యతో గత కొంతకాలంగా గొడవలు ఉన్నాయని మృతుడి అన్న ఈశ్వరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మృతిపై భార్యతోపాటు మరో వ్యక్తిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య రాజమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ఆస్పత్రికి తరలించారు.

క్రైం కార్నర్

మద్యం కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు

గోరంట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దలకుంటపల్లికి చెందిన వెంకటేష్‌కు మద్యం అక్రమ రవాణా కేసులో పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు మూడేళ్ల జైలుశిక్ష, రూ.2.01 లక్షల జరిమానా విధించినట్లు సీఐ శేఖర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. వెంకటేష్ 2021 నవంబరు 6న కర్ణాటక నుంచి 75 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యంతో పాటు 25 గుట్కా ప్యాకెట్లను తరలిస్తుండగా అప్పటి సీఐ జయనాయక్ అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. 2023లో చార్జిషీట్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయాధికారి బొజ్జప్ప.. నిందితుడిపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు సీఐ తెలిపారు.

శతాధిక వృద్ధుడి మృతి



ముల్లా అబ్దుల్ సాబ్ (ఫైల్)

యాడికి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాడు గ్రామంలో శతాధిక వృద్ధుడు ముల్లా అబ్దుల్ సాబ్ (102) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. ముల్లా అబ్దుల్‌సాబ్ వందేళ్లు దాటినా అలవోకగా తన పనులు తాను చేసుకొనేవాడని, కొలిమి పనితోపాటు కార్పెంటర్ పనికూడా చేసేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. రాగిముద్ద, జొన్నసంగటి, సద్దరొట్టెలు, జొన్న రొట్టెలు మొదలగు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వలనే ఇన్నిరోజులు ఆరోగ్యంగా ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ముల్లా అబ్దుల్‌సాబ్‌కు నలుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు సంతానం. 20మందికి పైగా మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు.

కూలీల ఆటో, ద్విచక్ర వాహనం ఢీ

ఒకరు మృతి.. ముగ్గురికి తీవ్రగాయాలు

కూడేరు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రకోడు గ్రామ సమీపాన మలుపు వద్ద ఆటో-ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. కొర్రకోడు గ్రామానికి చెందిన 14మంది కూలీలు బుధవారం శివరాంపేట వద్ద తోటలో టమోటాలు కోసేందుకు వెళ్లారు. పని ముగిసిన తర్వాత ఉదిరిపికొండ గ్రామానికి చెందిన ఓ ఆటోలో సాయంత్రం ఆరు గంటల సమయంలో స్వగ్రామానికి బయల్దేరారు. కొర్రకోడు గ్రామానికి చెందిన గణేష్ జల్లిపల్లికి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. అయితే కొర్రకోడు మలుపు వద్ద రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కూలీ అనసూయమ్మ(57) మృతిచెందారు. మిగిలిన కూలీలు సంజమ్మ, పద్మావతితో పాటు ద్విచక్ర వాహనదారుడు గణేష్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వీరిని ప్రైవేట్ వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కట్నం కేసులో ఏడాది జైలు

అనంతపురం క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధించిన భర్తకు కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. 2015లో వెన్నపూస సౌభాగ్యలక్ష్మికి రాజీవ్‌కాలనీకి చెందిన బ్రహ్మానందరెడ్డితో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ.5లక్షలు కట్నంగా ఇచ్చారు. అయితే రూ.10లక్షల అదనపు కట్నం తీసుకురావాలని ఆమెను బ్రహ్మానందరెడ్డి, అతడి తల్లి లక్ష్మీదేవి, తండ్రి ఆదిరెడ్డి, సోదరుడు చెన్నారెడ్డి, సోదరి కృష్ణకుమారి మానసికంగా, శారీరకంగా వేధించారు. ఈ విషయంపై సౌభాగ్యలక్ష్మి 2016 ఫిబ్రవరి 28న త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు వారిని రిమాండ్‌కు పంపడంతో పాటు కోర్టులో చార్జిషీట్ వేశారు. కేసు విచారించిన మొబైల్ కోర్టు న్యాయాధికారి సుజిన్ మొదటి ముద్దాయి బ్రహ్మానందరెడ్డికి ఏడాది జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధించారు. మిగిలిన నలుగురిపై నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టి వేశారు. ఈ కేసును ఏపీపీ శ్రీనివాసులు ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు.

ఖననం.. గగనం..!

✦ శ్మశాన వాటికలు లేక పాట్లు
✦ దశాబ్దాలు గడుస్తున్నా పట్టించుకోని పాలకులు, అధికారులు
✦ రోడ్డు పక్కన, కాలువల్లో మృతదేహాలను పూడ్చుతున్న వైనం

ముదిగుబ్బ/నల్లమాడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రాలు, గ్రామాల్లో శ్మశాన వాటికలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా మరణిస్తే.. వారి జ్ఞాపకార్థంగా సమాధులు కట్టుకోవడానికి స్థలం లేక అవస్థలు పడుతున్నారు. వాగులు, వంకల్లో... దారి పక్కన అంత్యక్రియలు నిర్వహించుకోవాల్సిన దయనీయ పరిస్థితి ఉంది. ముదిగుబ్బలో శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని దశాబ్దాలుగా రాజకీయ నాయకులు, అధికారులను ప్రజాసంఘాలు కోరుతున్నా పట్టించుకోవడం లేదు. నిరసనలు చేసినా స్పందించడం లేదు. ఈ ఏడాది ఆగస్టులో సీపీఎం ఆధ్వర్యంలో స్థలం కోసం శవయాత్ర నిర్వహించి ముదిగుబ్బ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. పెద్దల పండుగ రోజు ఏడాదికి ఒకసారి సమాధుల వద్ద కొబ్బరికాయలు కొట్టి వారి జ్ఞాపకాలను తలచుకునే అవకాశమే లేకుండా పోతోంది. ఇక నల్లమాడలోనూ ఇదే సమస్య ఉంది. ఎవరైనా చనిపోతే వారి సొంత భూములోనే ఖననం చేస్తున్నారు. సామాన్యులు ఎవరైనా చనిపోతే రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూముల్లో పూడ్చుతున్నారు. నల్లమాడ మండలంలో కుటాలపల్లి, సోముగుట్టపల్లి, కొండ్రవారిపల్లి, చిల్లగూర్లపల్లి, పెద్దకోట్లపల్లి, నల్లమాడ, రెడ్డిపల్లి, చౌటకుంటపల్లి, చెర్లోపల్లి, మూలప్పగారిపల్లి, అప్పయ్యగారిపల్లి, పెమనకుంట పల్లి తదితర గ్రామాల్లో శ్మశాన వాటికలు లేవు. మండలంలో 90 శాతం గ్రామాల్లో శ్మశాన వాటికలు లేకపోవడంతో శవాలను పూడ్చడానికి నానా తంటాలు పడుతున్నారు.

స్థలం కేటాయించండి



ఇరవై వేల జనాభా గల ముదిగుబ్బలో శ్మశానవాటిక కోసం సరైన స్థలం లేక వాగులు, వంకల్లో ఖననం చేసే పరిస్థితి ఉంది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఈ సమస్యపై దృష్టి సారించాలి.

- శీనయ్యగారి రమణ, ముదిగుబ్బ

త్వరలో స్థలం కేటాయిస్తాం

హిందూ శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని పలువురు నా దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ స్థలాలు పరిశీలించి త్వరలో ఈ సమస్యను పరిష్కరిస్తాం.

- నారాయణస్వామి, తహసీల్దార్, ముదిగుబ్బ



ముదిగుబ్బ: వంకలో సమాధులు



నల్లమాడ: ఎన్ బండవాండ్లపల్లిలో రోడ్డు పక్కన సమాధులు

న్యూస్ బాక్స్ ...



పుట్టపర్తి : ఏఎస్పీకి వినతిపత్రం అందచేస్తున్న జర్నలిస్టులు

నటుడు మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై దాడి చేసిన సినీనటుడు మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలని జిల్లాకేంద్రంలో జర్నలిస్టులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అడిషనల్ ఎస్పీ ఆర్ఎశ్రీనివాసులకు వినతిపత్రం అందచేశారు, కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, లెక్కల హరికృష్ణ, కార్యదర్శులు బాబు, ఉద్దండం చంద్రశేఖర్, కేశవ, చలపతి,నూర్, సుదాకర్, గణేష్, రవిశంకర్ పాల్గొన్నారు.

● ధర్మవరం: ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ కూడలి నుంచి కాలేజ్ సర్కిల్ మీదుగా కళాజ్యోతి సర్కిల్ వరకు విలేకరులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఇందులో ఏపీయూడబ్ల్యూజే ధర్మవరం సబ్ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జానపాటి మోహన్, జాంపుల్ల అజయ్‌చౌదరి, జిల్లా నాయకులు రామాంజినేయులు, జీవీ నారాయణ, ప్రసాద్, వెంకటేశ్‌చౌదరి, పామాల నాగేంద్ర, బావిశెట్టి, జయరామిరెడ్డి, గోల్డ్‌ప్రసాద్, బానుప్రసాద్, గంటపారనాగరాజు, జయశంకర్, మహదేవరెడ్డి, గ్రంథే శ్రీనివాసులు, రాఘవ, రమణ, హరి, కల్యాణ్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: సినీనటుడు మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజె మండలాధ్యక్షుడు షాజహాన్, సభ్యులు గోపినాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, ఫిరోజ్ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గోపి, జిల్లా కార్యవర్గ సభ్యులు సాదిక్ వలీ, బుజంగరావు, విలేకరులు చంద్ర, ఫిరోజ్, ఫయాజ్, బాబా, మౌలాలీ, ఆనంద్, మహబూబ్‌బాషా, విశ్వనాథ్‌రెడ్డి, అయ్యప్ప పాల్గొన్నారు.

● ముదిగుబ్బ: స్థానిక జర్నలిస్టులు సీఐ శివరాముడికి వినతిప త్రం చేశారు. ఇందులో పాత్రికేయులు వెంకటనాయుడు, రఘు, కుతుబుద్దీన్, సూర్యనారాయణ, జయప్రకాశ్, నరసింహారెడ్డి, రాజేశ్, సిద్దయ్య, అలీ, నరేశ్, మల్లికార్జున పాల్గొన్నారు.

● కదిరి: జర్నలిస్టులు స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అక్కడ బైఠాయించారు.

కమ్యూనిస్టు నాయకుడు పెద్దన్న మృతి



పెద్దన్న (ఫైల్)

కదిరిలీగల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు నాయకుడు, ఎస్‌పే రవూఫ్ అనుచరుడు పెద్దన్న(90) అనారోగ్యంతో బుధవారం మరణించాడు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. వడ్లమూడి కృష్ణారావు మెమోరియల్ కమిటీ తరఫున దేవానుం దరాలు అరుణ వస్త్రాన్ని కప్పి, చైతన్య గీతాలతో నివాళులర్పించారు. కదిరి మున్సిప ల్ పరిధిలోని కుటాగుళ్లలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఆయన.. చిన్నతనం నుంచే కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితుడయ్యాడు. విప్లవోద్యమంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నాడు. నిర్బంధాలు, పోలీసు దెబ్బలను ఓర్చుకున్నాడు. తదనంతర కాలంలో ఆరోగ్య సమస్యలు, కుటుంబ సభ్యుల ఒత్తిడితో కుటాగుళ్ల సమీపంలో పట్టుపరిశ్రమలో కార్మికుడిగా తన జీవనాన్ని కొనసాగించారు. వ్యవసాయం, పశుపోషణతో జీవనాన్ని గడిపాడు.

వీధిదీపాలు ఏర్పాటు చేయండి

నల్లమాడ డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ బండ వాండ్లపల్లి గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. పదేళ్లక్రితం వీధిదీపాలు ఏర్పాటు చేశారని, 15 వీధిదీపాల్లో ప్రస్తుతం మూడు మాత్రమే పనిచేస్తున్నాయని చెప్పారు. మిగిలిన వాటికి మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు పంచాయతీ అధికారులకు చెప్పినా.. పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. విషపురుగులు తిరుగుతుండటంతో రాత్రి వేళల్లో ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయంగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలన్నారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామాభివృద్ధి ప్రణాళికలపై సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దీపికారెడ్డి, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ కుచ్చే రవీంద్ర మాట్లాడారు. పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, అందరికి విద్య, ఆకలి లేని సమాజం, లింగ సమానత్వంపై వివరిం చారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ లక్ష్మీ, ఆరోగ్య శాఖ మురళి, సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సుందరయ్యకాలనీలో సమస్యలు పరిష్కరించాలి

ఓబుళదేవరచెరువు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి, హిందూపురం ప్రధాన రహదారి వద్ద ఉన్న సుందరయ్య కాలనీలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు ఎంపీడీఓ రాబర్టు విల్సన్‌కు బుధవారం విన్నవించారు. కాలనీలో తాగునీరు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్‌ఎంపీ హరిక్రిష్ణ, జిల్లా యువజన కార్యదర్శి నరేష్‌బాబు, మండలాధ్యక్షులు సున్నంపల్లి రంగారెడ్డి, నాయకులు వెంకటేష్, వెంకటలక్ష్మీ, రమణయ్య, అంజి పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి అందజేత

బుక్కపట్నం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు జిల్లా టీడీపీ కార్యదర్శి సామకోటి ఆదినారా యణ బుధవారం రూ. 20 వేల విలువైన క్రీడా సామగ్రిని అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపల్ మగ్బుల్ హుస్సేన్, అధ్యాపకులు ఓబులేసు, టీడీపీ నాయ కులు ఈశ్వరయ్య, యువనాయకులు దిలీప్, మంజునాథ్, గోపాల్ పాల్గొన్నారు.



క్రీడాసామగ్రి పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో ఉరుసు

చిలమత్తూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో సయ్యద్ బాబా దర్గా ఉరుసు కార్యక్రమం బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డా. సురేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా డా. సురేంద్ర మాట్లాడుతూ మతసామరస్యంగా ఉరుసు కార్యక్రమం జరగడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగారెడ్డి, అంజినప్ప, శ్రీదేవి, బాలాజీ పాల్గొన్నారు.



ధర్మవరం: మహాగణపతి హోమం నిర్వహిస్తున్న పండితులు

వైభవంగా అయ్యప్పస్వామికి పూజలు

ధర్మవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక చెరువు కట్ట వద్దగల అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో లక్షార్చన పూజా కార్యక్రమాన్ని చేపట్టారు. తెల్లవారుజామున మహాగణపతి హోమం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప చిత్రపటాలను వివిధ పూలతో అలంకరించి పూజలు నిర్వహించి భజనలు చేశారు. అనంతరం కన్నెస్వాములతో లక్షార్చన పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం 11గంటలకు భక్తులకు పెద్దఎత్తున అన్నదానం చేపట్టారు.

● కదిరి అర్బన్ : స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం 48వ మండల పూజను వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం మహాగణపతి హోమంతో మండల పూజను ప్రారంభించారు. 48 కేజీల నెయ్యితో అయ్యప్పస్వామికి అభిషేకం చేశారు. అయ్యప్పస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం 1.30గంటలకు కన్యపూజ చేసి, సాయంత్రం 6గంటలకు పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప మాధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గురువారం మధ్యాహ్నం 3గంటలకు అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అయ్యప్పసేవా సమితి తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కదిరి అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్మికులు బుధవారం స్థానిక ఆ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. వీరి ఆందోళనకు కాంగ్రెస్ నాయకుడు కదిరప్ప మద్దతుపలికారు. ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని, ఈఎస్ఈ, పీఎఫ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు.

రైతు సమస్యలు పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

కొత్తచెరువు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని తప్పకుండా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి స్పష్టం చేశారు. బుక్కపట్నం చెరువు తూములకు మరమ్మత్తులు చేసి కాలువలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల రైతులు వారిని విజ్ఞప్తి చేశారు. దీంతో బుధవారం వారు ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆ తూములను పరిశీలించారు. సాగునీటి కాలువలు, తూములకు వెంటనే మరమ్మత్తులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వారి వెంట రైతులు, కూటమి నాయకులు ఉన్నారు.

● గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

కొత్తచెరువులోని గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు ఉపయోగపడే రూ. 16 వేల విలువైన పుస్తకాలను ఎమ్మెల్యే, మాజీ మంత్రి గ్రంథాలయాధికారి జయరాంకు బుధవారం అందజేశారు. వారి వెంట తహసీల్దార్ నీలకంఠారెడ్డి, ఇతరశాఖ అధికారులు ఉన్నారు.

● తాగునీటి సమస్య రానివ్వకండి

పుట్టపర్తిరూరల్: మునిసిపాలిటీలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని మునిసిపల్ అధికారులకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సూచించారు. స్థానిక శిల్పారామం కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఆ కాలనీ వాసులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే బుధవారం ఆ కాలనీలో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా బోరు తవ్వకాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.1.30 కోట్లతో మునిసిపాలిటీలో నీటి సమస్యను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు.



తూమును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

క్రైం న్యూస్ ..

ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి యత్నం

నల్లమాడ , డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో పులగంపల్లి సమీపంలోని కంకర మిషన్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తుకెళ్లడానికి గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి విఫలయత్నం చేశారు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు గట్టిగా కేకలు వేయడంతో వారి పారిపోయారని సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్‌ను తొలగించి కిందకు వేశారన్నారు. విద్యుత్ అధికారులు ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. గతంలోనూ పలు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ అయ్యాయని, వాటిపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశామని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో బీడుపల్లి క్రాస్ వద్ద బైక్‌లో అక్రమంగా 12 కర్ణాటక మద్యం బాటిళ్లను తీసుకెళ్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. బుధవారం ఆయన బ్రాహ్మణపల్లి ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో మాట్లాడుతూ... బైక్‌ను, మద్యంను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఉమామనోహర్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం..

బత్తలపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బత్తలపల్లి బైపాస్ సమీపంలో బుధవారం ఉదయం రేషన్ బియంతో వెలుతున్న బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. రాప్తాడులోని మైనార్టీ కాలనీకి చెందిన ఓ వ్యక్తి... అనంతపురం చుట్టు ఎక్కల గ్రామాల్లో రేషన్ బియం సేకరించి వాటిని బొలెరో వాహనంలో బెంగళూరుకు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అందులోని 80 ప్యాకెట్ల బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. తహసిల్దార్ స్వర్ణలత ఫిర్యాదు మేరకు బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.



జవాన్ పార్థివదేహాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న అధికారులు

నార్పలకు వీరజవాన్ పార్థివదేహం

నేడు అంత్యక్రియలు



వెంకటసుబ్బయ్య (ఫైల్)

నార్పల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో తీవ్రవాదులు అమర్చిన ల్యాండ్‌మైన్ పేలి వీరమరణం పొందిన జవాన్ వెంకటసుబ్బయ్య భౌతిక కాయం బుధవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో నార్పలకు చేరుకుంది. జమ్మూ కశ్మీర్ నుంచి బెంగళూరుకు ఆర్మీ అధికారులు జవాను భౌతిక కాయాన్ని తీసుకొచ్చారు. అక్కడి నుంచి మిలిటరీ వాహనంలో నార్పలకు తరలించారు. నార్పల మండలంతోపాటు చుట్టు పక్కల గ్రామాలు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు నార్పలకు చేరుకుని వీర జవానుకు ఘన నివాళులర్పించారు. జవాను భౌతిక కాయం నార్పలకు చేరుకోగానే రోడ్డుకు ఇరువైపులా వందలాది మంది నిలబడి కొవ్వొత్తులు పట్టుకుని జోహార్లు అర్పించారు. జాతీయ జెండాను చేత పట్టుకుని నినాదాలు చేశారు. వెంకటసుబ్బయ్యకు గురువారం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సీఐ కౌలుట్లయ్య తెలిపారు. అంత్యక్రియలకు ఆయన స్వస్థలం ప్రకాశం జిల్లా రాయపాడు నుంచి కుటుంబసభ్యులు, బంధుమిత్రులు నార్పలకు చేరుకున్నారు.

● కుటుంబ సభ్యులకు పరామర్శ

జమ్మూలోని పూంఛ్ సెక్టార్‌లో 30 మంది సైనికులను కాపాడి ప్రాణత్యాగం చేసిన జవాన్ వెంకటసుబ్బయ్య కుటుంబాన్ని పలువురు జిల్లా అధికారులు పరామర్శించారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప, ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా పోలీసు అధికారులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు.





కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న అధికారులు



గ్రామంలో జవానుకు జోహార్లు అర్పిస్తూ.. ప్రదర్శన

దారంతా రాళ్లూరప్పలే..!

◆ తారు రోడ్డే ఎరుగని చిన్నూరుబత్తలపల్లి
◆ దశాబ్దాలు గడిచినా మట్టిరోడ్డే దిక్కు
◆ గ్రామస్థులకు తీవ్ర ఇబ్బందులు
◆ నిధులుమంజూరైనా రోడ్డు వేయని వైనం

ధర్మవరంరూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ధర్మవరం నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నూరుబత్తలపల్లికు రహదారి అధ్వానంగా ఉంది. దశాబ్దాలుగా ఈ గ్రామానికి మట్టి రోడ్డే దిక్కు. దర్శనమల క్రాస్ నుంచి ఈ గ్రామానికి ఉన్న మట్టి రోడ్డు మొత్తం రాళ్లూరప్పలే... అతుకులు.. గతుకులే. ఈ రోడ్డు మీద కనీసం నడుచుకుంటూ వెళ్లడానికి కూడా వీలుకానంతగా ఉంది. ఇంక ప్రయాణం.. నరకప్రాయం. ఎన్నికల సమయంలో వచ్చే నాయకులు.. తాము గెలిస్తే ఈ గ్రామానికి రోడ్డు వేయిస్తామని హామీలు ఇస్తున్నారే తప్పా.. గెలిచిన తర్వాత కనీసం ఈ గ్రామం వైపు కన్నెత్తి చేయడం లేదని ఆ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు పాడి రైతులు, ఇతర పనులు నిమిత్తం ధర్మవరానికి ఈ రోడ్డు మీద రావాల్సిందే. ఈ రోడ్డంతా గుంతలుపడి రాళ్లు తేలడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోవాళ్లు ఆ రోడ్డులో రావడానికి జంకుతున్నారన్నారు.



చిన్నూరుబత్తలపల్లికి వెళ్లే మట్టి రోడ్డు

తప్పనిపరిస్థితుల్లో ఈ గుంతల రోడ్‌పై బైక్‌దారులు ఎక్కడ కిండపడతామోనని భయపడుతూ వెళ్తున్నారు.

● నిధులు మంజూరైనా...

2019 ఫిబ్రవరిలో టీడీపీ ప్రభుత్వం ధర్మవరం ప్రధాన రహదారి నుంచి చిన్నూరుబత్తలపల్లి మీదుగా ధర్మపురి గ్రామం వరకు తారురోడ్డు నిర్మాణం కోసం 1.90కోట్లు నిధులు మంజూరు చేసింది. అయితే అనంతరం ప్రభుత్వం మారడంతో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి 1.80కోట్లుతో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం దాని గురించి.. మరిచిపోయారు.

ఇబ్బందులు పడుతున్నాం



మా గ్రామానికి ఉన్న మట్టిరోడ్డు అంతా గుంతలుపడి రాళ్లు తేలాయి. దీంతో అనేక సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. పాలకులు వస్తారు... రోడ్డు వేసేందుకు భూమిపూజ చేస్తారు.. శిలాఫలకాలు పెడతారు... అంతే... ఇక తిరిగి చూడరు. రోడ్డు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నాం.

- సుబ్బరాయుడు, చిన్నూరుబత్తలపల్లి

నరకప్రాయం..



మా గ్రామానికి పోవాలంటే నాలుగు కిలోమీటర్లు మట్టిరోడ్డులో ప్రయాణం చేయాలి. ఈ రోడ్డులో ప్రయాణం అంటే నరకమే. వర్షం వస్తే మట్టిరోడ్డులో ప్రయాణం మరింత భయంభయంగా ఉంటుంది. అనేక మార్లు మా గ్రామస్థులు జారిపడి గాయపడ్డారు. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డువేసి ఈ కష్టాలు తీర్చాలి.

- రామ్మోహన్, చిన్నూరుబత్తలపల్లి

త్వరలో పనులు

చిన్నూరుబత్తలపల్లి, ధర్మపురి గ్రామాలకు వెళ్లే రహదారిని త్వరలోనే తారురోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. గతంలో నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్‌యోజన పథకం కింద, లేదా ఎన్ఆర్‌జీఎస్ కింద నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

-శ్రీనివాస్, ఈఈ, పీఐయూ, పుట్టపర్తి

ఎర్రరిబ్బన్లతో ఎంతకాలం?



● శిథిలావస్థలో హిందూపురం ఆర్టీసీ బస్టాండ్
● పెచ్చులూడుతున్న పైకప్పు
● ప్రయాణికులకు పొంచి ఉన్న ప్రమాదం
● రిబ్బన్లు కట్టి హెచ్చరించడంతో సరి
● రోజూ రూ.11 లక్షల ఆదాయం వచ్చినా నిర్లక్ష్యమే

హిందూపురం అర్బన్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): నిత్యం వేలాది మంది ప్రయాణికులు, రూ.11 లక్షల కలెక్షన్‌తో నడుస్తున్న హిందూపురం డిపో అరకొర వసతులతో కునారిల్లుతోంది. ఎనిమిది నెలలుగా బస్టాండ్ పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. పైకప్పుకున్న సిమెంటు ప్లాస్టింగ్ ఊడిపోయి ఇనుప కమ్మీలు దర్శనమిస్తున్నాయి. ఎప్పుడు పెచ్చులు ఊడి ప్రయాణికులపై పడుతాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. పెచ్చులూడుతున్న విషయం గమనించకుండా ప్రయాణికులు కూర్చుంటే తల పగలడం ఖాయం. ఇటీవల ప్రయాణికులు అక్కడ కూర్చుని ఉండగా పెచ్చులు ఊడి పడ్డాయి. అయితే అదృష్ట వశాత్తు ప్రయాణికులు కూర్చున్న స్థలంలో కాకుండా పక్కన పడ్డాయి. దీంతో ప్రమాదం తప్పింది. దీంతో ప్రయాణికులు అక్కడ నుంచి మరో చోటికి వెళ్ళి కూర్చున్నారు. ఈ విషయం గమనించిన ఆర్టీసీ యాజమాన్యం వారు అక్కడ ఎర్ర రిబ్బన్‌లు ఏర్పాటు చేసి పెచ్చులు ఊడుతున్న ప్రాంతంలోకి ప్రయాణికులు వెళ్ళకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇలా రిబ్బన్‌లు కట్టి రెండు నెలలు కావస్తున్నా వాటిని మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. ఈ ఆర్టీసీ డిపో నుంచి ప్రస్తుతం 82 సర్వీసులు నడుస్తున్నాయి. అందులో సూపర్ లగ్జరీ బస్సులు 12 కాగా, ఇంద్రా బస్సులు 2, ఎక్స్‌ప్రెస్ బస్సులు 23, అల్ట్రా పల్లెవెలుగు బస్సులు 5, పల్లెవెలుగు బస్సులు 40 ఉన్నాయి. ఈ బస్సుల ద్వారా ప్రతిరోజు వేలాదిమంది ప్రయాణికులు గమ్యస్థానాలు చేరుకుంటుంటారు. ఇంత పెద్ద డిపోలో ప్రయాణికులు ఇబ్బందికర వాతావరణం ఎంతకాలం భరించాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. చిన్న మరమ్మతులకు కూడా ఇంతకాలమా? అని ప్రశ్నిస్తున్నారు.


పెచ్చులూడి కమ్మీలు కనిపిస్తున్న బస్టాండ్ పైకప్పు

టెండర్లలో ఎక్సెస్ ఉండటంతో ఆపేశారు

హిందూపురంలోని ఆర్టీసి బస్టాండ్‌లో పైపెచ్చులు ఊడి పడుతున్న విషయం ఉన్నతాధికారులకు తెలియజేశాము. సివిల్ ఇంజనీరింగ్ వారు వచ్చి పరిశీలించి మరమ్మతు పనుల కోసం టెండర్లు పిలిచారు. ఎక్సెస్ ఉండటంతో టెండర్లు ఆపేశారు. ఈ వారంలో మరో మారు టెండర్లు పిలువనున్నారు. టెండర్లు పూర్తి కాగానే పనులు మొదలుపెట్టి మరమ్మతులు చేపడతారు.

-శ్రీకాంత్, డిపో మేనేజర్

క్లుప్తంగా..

తిరుమలకు పాదయాత్ర


పాదయాత్ర ప్రారంభిస్తున్న భక్తులు

హిందూపురం అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): భక్తితోనే విశ్వశాంతి ఏర్పడుతుందని తిరుమల పాదయాత్ర నిర్వాహకుడు వైఎస్‌బి భాస్కర్ పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని సూరప్పకట్ట వద్ద ఉన్న వైఎస్‌బి గ్యారేజ్ అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద నుంచి బుధవారం భక్తులు తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. పాదయాత్ర 8వ వార్షికోత్సం సందర్భంగా పలువురు హాజరై భక్తులను గోవిందనామాల స్మరణతో సాగనంపారు. అనంతపురం ఎంపీ కుమారుడు వీక్షిత్, వాల్మీకి సంఘం నాయకులు చోళేమర్రి రామకృష్ణ, ఆకులసూరి, వెంకటరమణ, బిఎన్ నాగరాజు, తదితరులు జెండా ఊపి పాదయాత్ర ప్రారంభించారు.

ట్రూఅప్ చార్జీలు ఉపసంహరించుకోండి

పెనుకొండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులపై ప్రభుత్వం మోపిన రూ.15,441కోట్ల అదనపు విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ట్రాన్స్‌కో ఏఈ నారాయణస్వామికి బుధవారం సీపీఎం నాయకులు వినతిపత్రం అందించారు. ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు పెంచమని, ట్రూఆఫ్ చార్జీలు ఉపసంహరిస్తామని పేర్కొందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి భారాన్ని తొలగించి మాట నిలబెట్టుకోవాలన్నారు. అదానీతో ఒప్పందాన్ని రద్దుచేసి తక్కువ ధరలకు విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ఉపసంహరించుకోవాలని హరి, సీఐటీయు నాయకులు బాబావలి, రమేష్, మహబూబ్ బాష, శెక్షావలి, నిస్సార్ తదితరులు డిమాండ్ చేశారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్

పరిగి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకుని కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలలో బుధవారం ఇస్కాన్ రాధాకాంత గోవిందదాసు ప్రభు భగవద్గీత కంఠస్థ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు మాట్లాడుతూ, విద్యార్థుల ఉచ్చారణాశక్తి, మానసిక వికాసాన్ని, ఏకాగ్రతను మనోధైర్యాన్ని పెంపొందించేందుకు ఈ భగవద్గీత పోటీలు ఉపయోగపడతాయన్నారు. హిందూపురం వాసులు డా. మురళీక్రిష్ణ విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను వితరణగా అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు

చిలమత్తూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో సయ్యద్ బాబా దర్గా ఉరుసు కార్యక్రమం బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డా. సురేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. చక్కర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా డా. సురేంద్ర మాట్లాడుతూ మతసామరస్యంగా ఉరుసు కార్యక్రమం జరగడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగారెడ్డి, అంజినప్ప, శ్రీదేవి, బాలాజీ, నందీషప్ప, మల్లిరెడ్డి, ప్రవీణ్‌కుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష

గోరంట్ల, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మర్రిమాను వద్దగల అయ్యప్పస్వామి ఆలయంలో టీడీపీ ఆధ్వర్యంలో మాలదారులకు బుధవారం భిక్ష ఏర్పాటు చేశారు. రాష్ట్ర బిసి సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత భర్త, టీడీపీ నాయకుడు వెంకటేశ్వరరావు అయ్యప్ప పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గురుస్వామి ఎంకె. ఆదినారాయణ, టీడీపీ మండల, పట్టణ కన్వీనర్లు సోము శేఖర్, కక్కల రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి


సీఐకి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

మడకశిరటౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై దాడి చేసిన మోహన్‌బాబుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బుధవారం మడకశిర పట్టణంలో జర్నలిస్టులు ర్యాలీ, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అమరాపురం బస్టాండు నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి సీఐ రామయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు.

హిందూపురం అర్బన్: విధి నిర్వహణలో ఉన్న విలేకరులపై దాడి చేసిన సినీ యాక్టర్ మోహన్‌బాబును అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని హిందూపురం విలేకరులు డిమాండ్ చేశారు. బుధవారం ర్యాలీగా వెళ్ళి స్థానిక వన్ టౌన్‌లో ఎస్ఐ జయరాంకు వినతి అందించారు.

మధ్యంతర భృతి ప్రకటించండి

హిందూపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర కానుకగా కరువుభత్యం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. మునిసిపాలిటీ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో బుధవారం ఎస్‌టియు నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ వచ్చే జనవరి సందర్భంగా మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. అలాగే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందుకూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెండింగ్‌లో ఉన్న డీఏ, ఐఆర్‌లను ప్రకటించాలన్నారు. 12వ పీఆర్‌సీ కమిషనర్ రాజీనామా చేసినందున వెంటనే కమిషనర్‌ను నియమించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు సమీవుల్లా, గంగాధర్, రాము పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యార్థులతో పోటీపడి చదవాలి

●ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి


ఫుడ్ కమిషన్ ఛైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో కార్పొరేట్ విద్యాసంస్థలతో పోటీ పడి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదవాలని ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. రహమత్‌పురంలోని కేజీబీవీ పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యమైనదిగా ఉందా? అని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకోసం అన్ని సదుపాయాలు అందిస్తున్నదని, కాస్మొటిక్ ఛార్జీలు కూడా పెంచిందని, మంచిగా చదివి ఉన్నత స్థానం చేరాలని విద్యార్థులకు సూచించారు. అంతకు ముందు చౌడేశ్వరీ కాలనీలోని ఎఫ్‌పీ షాప్, ఆబాద్‌పేట ఎఫ్‌పీ షాపులను తనిఖీ చేశారు. ఆయన వెంట డిఈఓ కిష్టప్ప, ఎంఈఓ గంగప్ప తదితరులు ఉన్నారు.

పాఠశాలలో నాణ్యమైన భోజనం అందుతుందా?

పెనుకొండ, రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సకాలంలో పాఠశాలలు, అంగన్‌వాడీకేంద్రాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతోందా అని విద్యార్థులను ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి ప్రశ్నించారు. ఆయన బుధవారం మండలంలోని గుట్టూరు ప్రభుత్వ ఆసుపత్రి, జెడ్పీహెచ్‌ఎస్, ఆల్విన్ కాలనీ, యర్రమంచి అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

భోజన ఏజెన్సీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి: సీఐటీయూ

అంగన్‌వాడీ భోజన ఏజెన్సీ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఆయనకు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందించారు. బుధవారం పెనుకొండకు వచ్చిన ఆయనను ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద సీఐటీయూ నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. అంగనవాడీ వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న ఈవెంట్స్ టీఏడీఏ గ్యాస్, కాయగూరల బిల్లులు ఇప్పించాలని కోరారు. ఆయన సమాధానమిస్తూ ఇవన్నీ తన పరిధిలోకి రావని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు హరి, సీఐటీయు నాయకులు రమేష్, మహబూబ్‌బాష, ఆటోనాగప్ప, అజయ్, తిప్పన్న పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

గుడిబండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించడానికే ప్రభుత్వం రెవిన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ కల్యాణచక్రవర్తి పేర్కొన్నారు. గుడిబండలో బుధవారం రెవిన్యూ సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి ప్రజలు భూ సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం వాటి పరిష్కారం కోసం పంచాయతీలకు వెళ్లి వాటి పరిష్కారానికి చొరవ చూపిందన్నారు. రెవిన్యూ సదస్సులో వన్‌బీ, పట్టాదారు పాసుపుస్తకం, అడంగల్, చేర్పులు, మార్పులు తదితర వంటివి పరిష్కరించవచ్చన్నారు. రైతులు ఇచ్చిన వినతులను స్వీకరించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ మహ్మద్‌బిలాల్, సర్వేయర్ ఫణికిషోర్, వీఆర్‌ఓలు రామప్ప, శివమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సుకు హాజరైన అధికారులు

నేడు మోరుబాగల్‌లో రెవెన్యూ సదస్సు

మండలంలోని మోరుబాగల్ గ్రామంలో గురువారం రెవిన్యూ సదస్సును నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి తెలిపారు. రైతులు రెవిన్యూ సదస్సుకు హాజరై తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు.

రైతు సమస్యలు తీర్చండి

మడకశిర రూరల్: గ్రామసభల ద్వారా భూసమస్యలు తీర్చాలని రైతులు అధికారులను నిలదీశారు. కలుమర్రి గ్రామంలో జరిగిన రెవెన్యూసదస్సులో రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికి మూడు సార్లు రెవెన్యూ గ్రామ సభలు ఏర్పాటుచేసి వినతి పత్రాలు స్వీకరించారని, నేటికీ ఒక్క రైతు సమస్యకూడా పరిష్కరం కాలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో రీసర్వే పేరుతో ఉన్న హద్దురాళ్లను తొలగించి రైతుల మధ్యచిచ్చుపెట్టారని, కొలతల్లో తేడా కారణంగా బ్యాంక్ అధికారులు రైతులకు రుణాలు ఇవ్వడంలేదన్నారు. ఇప్పుడైనా సరిచేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కరుణాకర్ మాట్లాడుతూ రైతుల భూసమస్యలు పరిష్కరించడం కోసమే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. రైతులు వినతి పత్రాల్లో తెలిపిన ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ గ్రామ సభలో రైతుల నుంచి 62 వినతిపత్రాలు వచ్చినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సిరంజిల కొరత

● బయటి నుంచి తెచ్చుకుంటున్న రోగులు


బయట నుంచి తెచ్చిన సిరంజితో రోగి బంధువు

హిందూపురం అర్బన్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి):హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలోని మాతాశిశు కేంద్రంలో ఇన్సులిన్, అప్పుడే పుట్టిన బిడ్డలకు జీరో డోస్ అందించే ఇంజక్షన్‌లు అందుబాటులో లేవు. ఆసుపత్రికి వచ్చే రోగులు వైద్య పరీక్షలకు వస్తే ఇంజక్షన్‌లు బయటినుంచి తెచ్చుకోవాలని సూచిస్తున్నారు.

లోకల్‌గా కొనుగోలు చేయాలి: లక్ష్మీరాంనాయక్

ప్రస్తుతం వాక్సినేషన్ వేసే సిరంజిలు అందుబాటులో లేని విషయం వాస్తవమే. వాటిని లోకల్‌గా కొనుగోలు చేయాలి. పర్మినెంట్ సూపరింటెండెంట్ సెలవులో ఉన్నారు. ఆయన రాగానే సిరంజిలను అందుబాటులోకి తెస్తాం.

కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య


నేత్రావతి

రొళ్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన చాకలి సతీష్‌భార్య నేత్రావతి కడుపునొప్పి భరించలేక మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆరు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతుండేది. నొప్పి తీవ్రమవడంతో మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో కుటుంబ సభ్యులు బయట ఉండగా గడియ పెట్టుకుని ఇంట్లో ఉరేసుకుంది. కాసేపటికి గమనించిన కుటుంబీకులు కొన ఊపిరితో ఉన్న ఆమెను రొళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం శిరా ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ నేత్రావతి మృతిచెందినట్లు భర్త సతీష్ తెలిపారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాలాజీ తెలిపారు.

దళిత న్యాయవాదుల సమావేశానికి తరలిరండి

పావగడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ ఈనెల 14న చిత్రదుర్గంలో జరిగే దళిత న్యాయవాదుల ఐక్యతా సమావేశానికి అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని తుమకూరు జిల్లా సంఘం జిల్లా కన్వీనర్ ప్రముఖ న్యాయవాది జె.సి.రంగధామయ్య తెలియజేశారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన దళిత న్యాయవాదుల సమావేశ మినీ పోస్టర్‌ను విడుదల ఆయన విడుదల చేశారు.మూడు దశాబ్దాల కాలంపాటు పోరాటాలు చేసి కోర్టుకు వెళ్లిన ఫలితంగా ఈఏడాది ఆగస్టు 1న ఏబీసీడీ వర్గీకరణ చేయాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు తీర్పు ఇవ్వడం ఎంతో గర్వకారణమన్నారు.

గ్రామాల్లో శరవేగంగా సీసీ రోడ్ల పనులు

మడకశిర రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామాల్లో సీసీ రోడ్లు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సీసీరోడ్ల నిర్మాణాల కోసం మండలానికి రూ.3 కోట్లు నిధులు విడుదల చేశారు. మండలంలో 16 పంచాయితీలు ఉన్నాయి. ఒక్కొక్క పంచాయితీకి రూ.20 లక్షలు చొప్పున రూ.3 కోట్లు విడుదల చేశారు. ఆ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని పూర్తి విస్మరించిందని గ్రామస్థులు వాపోతున్నారు. అభివృద్ధి పనులతో నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో పాఠశాల అభివృద్ధి పనులు

లేపాక్షి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలు, మౌలిక వసతులపై నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా బాలకృష్ణ వెంటనే స్పందించి తన సొంత నిధులు రూ.40లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. పాఠశాలలో మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడం, తాగునీటివద్ద పాచికట్టిపోవడం, డార్మెంటరీలో వసతులు సక్రమంగా లేకపోవడంతో మరమ్మతులు చేపట్టారు. కొన్ని గదులకు రంగులు వేశారు. వీటిని ఎమ్మెల్యే సహాయకులు డా. సురేంద్ర, పార్టీ సమన్వయకర్త శ్రీనివాసులు, పీఏ బాలాజీ, మండల కన్వీనర్ జయప్పలు బుధవారం పరిశీలించారు.

మండల అధికారులకు అభివృద్ధి పనులపై శిక్షణ

పరిగి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలోని అభివృద్ధి పనులపై మండల అధికారులకు బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ శ్రీధర్ మాట్లాడుతూ శాశ్వత గ్రామీణాభివృద్ధిపై అన్నిశాఖల అధికారులు ప్లానింగ్‌తో ముందుకెళ్లాలన్నారు.

శ్మశాన వాటికకు సిలికాన్ చాంబర్ విరాళం

పెనుకొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిందూ శ్మశానవాటికలో దహనసంస్కారాలు నిర్వహించుకోవడానికి వీలుగా ధర్మస్థల గ్రామ అభివృద్ధి యోజన, హిందూ రుద్రభూమి అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వీరేంద్ర హెగ్డే సిలికాన్ చాంబర్‌ను విరాళంగా ఇచ్చారు. పెనుకొండ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కన్నాస్వామి బుధవారం ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపారు. రూ.1,51,630 విలువచేసే సిలికాన్ బేసిన్ విరాళంగా అందజేసిన ఛైర్మన్ వీరేంద్రకు పెనుకొండ బ్రాహ్మణసంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఎంపీ బీకే పరామర్శ


శివరామప్పను పరామర్శిస్తున్న ఎంపీ పార్థసారథి

గోరంట్ల, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులేరు రోడ్డు వీధిలో నివాసముంటున్న టీడీపీ కార్యకర్త శివరామప్ప ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటుండగా, ఎంపీ బీకే పార్థసారథి బుధవారం పరామర్శించారు. ఆరోగ్యంపై ఆరాతీశారు. అనంతరం ఆప్రాంతానికి సరైన రోడ్డు లేదని స్థానిక ప్రజలు ఎంపీకి విన్నవించారు. ఎంపీ నిధులతో సీసీ రోడ్డు, మురుగునీటి కాలువలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ నాయకులు అశ్వత్థరెడ్డి, ఉమ్మర్‌ఖాన్, సుబ్బరాయుడు, నీలకంఠారెడ్డి, నరేంద్రరాయల్, మణిశేఖర్ తదితరులు ఉన్నారు.

పరిశ్రమలతోనే మడకశిర అభివృద్ధి


శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న గుండుమల

మడకశిరటౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలతోనే వెనకబడిన మడకశిర అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. పట్టణ సమీపంలో బుధవారం ఇండియన్ డిజైన్ గార్మెంట్ పరిశ్రమ త్వరలో ప్రారంభం కాబోతోందన్నారు. అందులో భాగంగా ప్రస్తుతం శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గంలో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారికి స్థానికంగానే ఉపాధి కల్పించాలన్నదే తమలక్ష్యం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మడకశిర పర్యటన సందర్భంగా పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందిస్తామని, వెనకబడిన ప్రాంతం అభివృద్ధికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారన్నారు. అందులో భాగంగానే ఆర్.అనంతపురం వద్ద కొత్త పరిశ్రమ నెలకొల్పేందుకు పచ్చజెండా ఊపినట్లు తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన డీలర్ మృతి


శ్రీధర్ (ఫైల్)

గోరంట్ల, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): భూ విక్రయం విషయంలో నెలకున్న వివాదం కారణంగా మండలంలోని మల్లాపల్లికి చెందిన టీడీపీ నాయకుడు, స్టోర్ డీలర్ శ్రీధర్(45) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. తన భూమిని అమ్మనివ్వకుండా అడ్డుపడుతున్నారన్న ఆవేదనతో శ్రీధర్ సెల్ఫీ వీడియోతో మంత్రికి సవితకు సందేశాన్ని పంపుతూ, పురుగులమందుతాగి సోమవారం ఆత్మహత్యయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. గోరంట్ల, హిందూపురంలలో చికిత్స అనంతరం బెంగుళూరుకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడికి భార్య గోపమ్మ, కుమారుడు బాలజీ, కుమార్తె దరణీ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు సీఐ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. శ్రీధర్ మృతి టీడీపీకి తీరని లోటని, ఆయన సేవలు మరవలేనివని మంత్రి సవిత, ఎంపీ పార్థసారధి విడివిడిగా తమ సంతాపం వ్యక్తం చేశారు.

సుస్థిర అభివృద్ధిపై శిక్షణ

గుడిబండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధిపై మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ సిబ్బంది సర్పంచులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఎంపీడీఓ గంగాధర్, కార్యదర్శి ప్రకాష్ శిక్షణ ఇచ్చారు.


జవాన్ పార్థివ దేహాన్ని ఊరేగింపు తీసుకొస్తున్న అధికారులు

నార్పలకు వీరజవాన్ పార్థివ దేహం

నేడు అంత్యక్రియలు


వెంకటసుబ్బయ్య (ఫైల్)

నార్పల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో తీవ్రవాదులు అమర్చిన ల్యాండ్‌మైన్ పేలి వీరమరణం పొందిన జవాన్ వెంకటసుబ్బయ్య భౌతిక కాయం బుధవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో నార్పలకు చేరుకుంది. జమ్మూ కశ్మీర్ నుంచి బెంగళూరుకు ఆర్మీ అధికారులు జవాను భౌతిక కాయాన్ని తీసుకొచ్చారు. అక్కడి నుంచి మిలిటరీ వాహనంలో నార్పలకు తరలించారు. నార్పల మండలంతో పాటు చుట్టు పక్కల గ్రామాలు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు నార్పలకు చేరుకుని వీర జవానుకు ఘన నివాళులర్పించారు. జవాను భౌతిక కాయం నార్పలకు చేరుకోగానే రోడ్డుకు ఇరువైపులా వందలాది మంది నిలబడి కొవ్వొత్తులు పట్టుకుని జోహార్లు అర్పించారు. జాతీయ జెండాను చేత పట్టుకుని నినాదాలు చేశారు. వెంకటసుబ్బయ్యకు గురువారం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సీఐ కౌలుట్లయ్య తెలిపారు. అంత్యక్రియలకు ఆయన స్వస్థలం ప్రకాశం జిల్లా రాయపాడు నుంచి కుటుంబసభ్యులు, బంధుమిత్రులు నార్పలకు చేరుకున్నారు.

● కుటుంబ సభ్యులకు పరామర్శ

జమ్మూలోని పూంచ్ సెక్టార్‌లో 30 మంది సైనికులను కాపాడి ప్రాణత్యాగం చేసిన జవాన్ వెంకటసుబ్బయ్య కుటుంబాన్ని పలువురు జిల్లా అధికారులు పరామర్శించారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప, ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా పోలీసు అధికారులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు.


కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న అధికారులు


పార్థివ దేహం ఊరేగింపులో పాల్గొన్న స్థానికులు